


నిష్పక్షపాత వార్తల నిజరూపం

22ND ANNIVERSARY
వసంతాల అక్షరోద్యమం 2004-2026

# నేటిధాత్రి®
తెలుగు వార్త పత్రిక


మీరు మన నేటిధాత్రిలో ఈ వార్తను వినడానికి, చదవడానికి క్యూఆర్‌ని స్కాన్ చేయ్యండి


మంగళవారం 14-07-2026 పేజీలు : 08 CIRCULATED AT : TELANGANA and ANDHRAPRADESH STATES సంపుటి : 22 సంచిక : 95 రూ॥ 6.00





# జూనియర్ ఎన్టీఆర్ వస్తున్నాడు?

## ఏపీ రాజకీయాలలో అడుగుపెడుతున్నాడు?


ఛీఫ్ ఎడిటర్
కట్టా రాఘవేందర్ రావ్
9063524136, 9908658888


## 18 న ఊరు.. వాడ పేరుతో అభిమానుల కీలక సమావేశం.

- ఈ నెల 18 సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నారు?
- విజయ్ బాటలో నడవనున్నాడు?
- ఎన్నికలకు సరిగ్గా రెండేళ్ల ముందు విజయ్ అలాగే వచ్చారు.
- అదే దారిలో ఎన్టీఆర్ నడవాలనుకుంటున్నారా?
- ఏపీ లో మొదలైన చర్చ?
- తెలుగు దేశం ఎన్టీఆర్ ను ఎప్పుడో పక్కన పెట్టింది?
- గతంలో హరికృష్ణ అన్న తెలుగుదేశం అని పార్టీ పెట్టారు?
- అదే పేరుతో వస్తారా? మరో పేరుతో వస్తారా?
- ఏపీ లో ఎన్నికలకు మూడేళ్ళ సమయం వుంది.
- రెండు సంవత్సరాలు విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తారు?
- ఎన్నికలకు ఏడాది మొత్తం ప్రజల్లో వుంటారు!
- ఎన్టీఆర్ పార్టీ పెడితే టీడీపీ, వైసీపీ పార్టీలకు దెబ్బే?
- ఆ రెండు పార్టీల నుంచి నాయకులు రావొచ్చు?
- పవన్ కళ్యాణ్ కు చోటు లేకుండా చేయొచ్చు?
- హరికృష్ణ కు జరిగిన అవమానాలు టీడీపీ లో జరిగాయి?
- ఎన్టీఆర్ అనేక అవమానాలు ఎదుర్కొన్నారు!
- రాజకీయాలలోకి రావాలంటే కొత్త పార్టీ ఏర్పాటు తప్పదు!
- జూలై 18న ఏం జరుగుతుందో అని అందరూ ఎదురుచూస్తున్నారు?

**హైదరాబాద్, నేటిధాత్రి:**

రాజకీయాల్లోకి ఎవరైనా రావొచ్చు. రాజకీయం చేయొచ్చు. శక్తి యుక్తులుంటే పార్టీ పెట్టొచ్చు. ప్రజా ఆశీర్వాదం వుంటే గెలువొచ్చు. పాలకులు కావొచ్చు. పరిపాలన చేయొచ్చు. కాని ఇదంతా ఎంత మందికి సాధ్యమనేది కూడా సమాజంలో వున్న ఏకైక ప్రశ్న. రాజకీయాల్లోకి వచ్చిన వాళ్లంతా సక్సెస్ కావాలన్న రూలేమీ లేదు. ఒకసారి సక్సెస్ కాకపోతే, ఎలాగైనా సక్సెస్ అయ్యేందుకు అహర్నిషలు కృషి చేసేవారున్నారు. మొదటి సారే సక్సెస్ కాకపోతే జెండా పీకేసిన వాళ్లున్నారు. రాజకీయాల్లో ఇవన్నీ సహజం. ఇప్పుడు ఆంధ్ర ప్రదేశ్ రాజకీయాల్లో కొన్ని సంచలన వార్తలు వినిపిస్తున్నాయి. అవి వాస్తవ రూపం దాల్చుతాయా? అనేది ఇప్పటికిప్పుడు ఎవరూ చెప్పలేకపోవచ్చు. కాలం వాటికి సమాదానం చెప్పొచ్చు. గత కొన్ని రోజులుగా ఏపిలో వినిపిస్తున్న ఏకైక మాట జూనియర్ ఎన్టీఆర్ త్వరలో రాజకీయాల్లోకి వస్తున్నారు? అంతకు ముందు ఎన్టీఆర్ ప్రజా సేవను ఎంచుకుంటున్నారు. అనే వార్త మాత్రం పెద్దఎత్తున వైరల్ అవుతోంది. చర్చనీయాంశమైంది. ఏపి రాజకీయాల్లోకి ఎన్టీఆర్ వస్తే ఎలా వుంటుందనే లెక్కలు కూడా అప్పుడే మొదలయ్యాయి. గత రాజకీయాలకు భిన్నంగా ఎన్టీఆర్ సరికొత్తగా వస్తున్నారని కూడా తెలుస్తోంది. ఒక రకంగా తమిళనాడులో విజయం సాదించిన సినీ స్టార్ విజయ్ దళపతి ఎంచుకున్న దారిలో ఎన్టీఆర్ నడుస్తారనే మాటలు వినిపిస్తున్నాయి. అందుకు ఈ నెల 18న శ్రీకారం జరుగుతుందని అంటున్నారు. అయితే ఆషాడ మాసంలో ఎన్టీఆర్ తన సేవ కార్యక్రమాలను మొదలు పెడతారా? అనే చర్చలు కూడా జరుగుతున్నాయి. కొన్ని మంచి పనులకు ముహూర్తాలు అవసరం లేదంటున్నారు. ఇప్పుడు కేవలం సామాజిక సేవ కార్యక్రమాలకు మాత్రమే శ్రీకారమని సమాచారం. ఏది ఏమైనా ఏపి రాజకీయాల్లో ఎన్టీఆర్ ఆగమనం ఒక సంచలనం నమోదు చేస్తుందని మాత్రం పెద్దఎత్తున చర్చ జరుగుతోంది. ప్రస్తుతం తెలుగుదేశం అనే పార్టీ నందమూరి సొంతం. కాని అది సీనియర్ ఎన్టీఆర్ బతికుండగానే నారా వారి సొంతమైంది. ఇప్పుడు ఆ పార్టీ నందమూరి సొంతం కాదు. ఎన్టీఆర్‌పేరును వాడుకోవడం నారా కుటుంబానికి నైతికత లేదు అనే మాటలు ఆనాటి నుంచి వినిపిస్తున్నాయి. కాకపోతే అడుగడుగునా ఆది నుంచి ఇప్పటి వరకు కూడా నందమూరి కుటుంబమే, నారా వారి పల్లకి మోస్తుందని చెప్పడంలో సందేహం లేదు. ఎప్పుడైతే హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ కూతురు నారా వారి కోడలైనప్పటి నుంచి రెండు కుటుంబాల బంధం మరింత పెనవేసుకున్నది. జూనియర్ ఎన్టీఆర్ కుటుంబాన్ని మాత్రం దూరం పెట్టిందనే చర్చను కొట్టిపారేయలేనిది. ఒక్కసారి సీనియర్ ఎన్టీఆర్ కాలాన్ని మననం చేసుకుంటే రాజకీయాల్లోకి రాకముందు నట వారసుడు ఎవరు? అని అప్పట్లో మీడియా ప్రశ్నిస్తే బాలకృష్ణ అని సమాధానం చెప్పేవారు. అలాగే తాతమ్మకల సినిమాతో బాలకృష్ణను తెరంగేట్రం చేశారు. తర్వాత ఎన్టీఆర్ కీలక భూమిక పోషించిన అనేక సినిమాల్లో బాలకృష్ణ చేత పాత్రలు వేయించారు. బాలకృష్ణను ప్రేక్షకులకు చేరువ చేశారు. అలా పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, బీష్మ, అక్బర్ సలీమ్ అనార్కలి, దానవీర శూరకర్ణ, అన్నదమ్ముల అనుబంధం వంటి అనేక సినిమాల్లో బాలకృష్ణతో పాత్రలు వేయించారు. తర్వాత కాలంలో ఎన్టీఆర్‌కు రాజకీయాల్లోకి వెళ్లాలన్న ఆలోచన వచ్చింది. తమిళనాడులో సినీ దిగ్గజం ఎన్‌జి. రామచంద్రన్ సిఎం. అయ్యారు. అదే దారిలో ఆనాడు ఎన్టీఆర్ నడిచారు. తెలుగుదేశం పార్టీ ప్రకటించిన 9 నెలల్లోనే అధికారంలోకి వచ్చారు. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో మొదటిసారి సిఎం. అయ్యారు. ఆ సమయంలో ఎన్టీఆర్‌కు చేదోడుగు వాదోడుగా వుంటూ, అహర్నిషలు పార్టీ కార్యక్రమాలు చూసుకున్న వ్యక్తి నందమూరి హరికృష్ణ. సొంత కొడుకైనా చైతన్య రథం డ్రైవర్‌గా పనిచేశారు. అంటే రాజకీయాలను చాలా దగ్గరగా చూసే అవకాశం ఎన్టీఆర్ అలా హరికృష్ణకు కల్పించారు. ఎన్నటికైనా సరే తెలుగుదేశం పార్టీ వారసుడు హరికృష్ణే అనే నిర్ణయంతో ఎన్టీఆర్ వుండేవారు. అప్పటికి నారా చంద్రబాబు నాయకుడు తెలుగుదేశం పార్టీలోకి రాలేదు. కాని అప్పటికే రాజకీయాల్లోకి వచ్చి, ఎమ్మెల్యే, మంత్రిగా కూడా బాధ్యతలు నిర్వర్తించిన చంద్రబాబు నాయుడు అనుభవం పార్టీకి అవసరమని ఎన్టీఆర్ అనుకున్నారు. పైగా స్వయాన అల్లుడుకావడంతో చంద్రబాబుకు పార్టీలో కీలక భాధ్యతలు అప్పగించారు. అయినా ఎన్టీఆర్ రాజకీయ వారసుడు హరికృష్ణ అని ప్రచారం వుంది. 1989లో తెలుగుదేశం ఓడిపోవడం, ఎన్టీఆర్ ఇంటికి పరిమితమైపోవడం వంటివి చంద్రబాబుకు కలిసి వచ్చింది. అసెంబ్లీలో ఉప నాయకుడుగా చంద్రబాబు వ్యవహరిస్తూ వచ్చారు. ఎన్టీఆర్ లేని లోటును తీర్చుతూ వచ్చారు. ఇంతలో ఎన్టీఆర్ మరో పెళ్లి చేసుకోవడం, లక్ష్మిపార్వతి పాత్ర పెరిగిపోవడంతో తెలుగుదేశంలో ఓ అలజడి మొదలైంది. ఆ సమయంలో సీనియర్ ఎన్టీఆర్, తన రాజకీయ వారసుడు హరికృష్ణ అని ప్రకటించాలని అనుకున్నారు. విశాఖపట్నం వేదికగా ఆ ప్రకటన చేసేందుకు సిద్ధమయ్యారు. ఇంతలోనే చంద్రబాబు నాయుడు తన మార్కు రాజకీయం చూపించారు. పార్టీని తన వశం చేసుకున్నాడు. హరికృష్ణను తన వారసుడుగా ఎన్టీఆర్ అనుకుంటున్నారన్న విషయం హరికృష్ణకు చేరకముందే, చంద్రబాబు వర్గంలోకి చేరిపోయారు. అలా చంద్రబాబు నాయుడు తన రాజకీయ చాణక్యాన్ని ప్రదర్శించి హరికృష్ణను, ఎన్టీఆర్‌కు దూరం చేశారు. ఎన్టీఆర్‌ను పదవీచ్యుతున్ని చేయడంలో హరికృష్ణను ముందు పెట్టి రాజకీయం చేశారు. కాని ఆఖరుకు హరికృష్ణకు కూడా చంద్రబాబు నాయకుడు అన్యాయం చేశారు. 1995లో చంద్రబాబు నాయుడు మంత్రి వర్గంలో హరికృష్ణను రవాణా శాఖ మంత్రిగా తీసుకొని, ఆరు నెలల తర్వాత ఆ పదవిని పొడిగించలేదు. అలా హరికృష్ణను తొలి దెబ్బ కొట్టారు. అలా కుటుంబ సభ్యులందరినీ దూరం పెడుతూ వచ్చారు. 1999 ఎన్నికల్లో రెండోసారి చంద్రబాబు నాయుడు సిఎం. అయ్యాక నందమూరి కుటుంబాన్ని పూర్తిగా దూరం పెట్టేశారు. హరికృష్ణకు రాజకీయజీవితం లేకుండా చేశారు. ఎప్పుడైతే హరికృష్ణను పక్కన పెట్టారో అప్పుడు ఆయన అన్న తెలుగుదేశం పార్టీని స్థాపించారు. కాని అది సక్సెస్ కాలేపోయింది. ఆ సమయంలో హరికృష్ణ సినిమాల్లోకి వచ్చారు. కొన్ని సినిమాలు తీశారు. అవి బాగానే సక్సెస్ అయ్యాయి. ఆ సమయంలో చంద్రబాబు నాయుడు ప్రభుత్వానికి వ్యతిరేకంగా టైగర్ హరిశ్చంద్ర ప్రసాద్ అనే సినిమాను తీశారు. చంద్రబాబు మీద వ్యతిరేకత పెరగడానికి కాణమయ్యారు.

2004లో తెలుగుదేశం పార్టీ ఓటమి పాలయ్యింది. అప్పుడు మళ్లీ హరికృష్ణ అవసరం వచ్చింది. నిజానికి హరికృష్ణ అమాయకుడు. మళ్లీ చంద్రబాబు నాయకుడును నమ్మారు. రాజ్యసభ ఇచ్చి హరికృష్ణను నమ్మించారు. 2009 ఎన్నికల ముందు ఈ తంతు పూర్తి చేశారు. అప్పటికే జూనియర్ ఎన్టీఆర్ సినిమాల్లో దూసుకుపోతున్నారు. ఎన్టీఆర్ చరిష్మాను కూడా వాడుకోవాలనుకున్నారు.అదృష్టమో దురదృష్టమో కాని ఎన్టీఆర్ అనుకోకుండా ప్రమాదానికి గురయ్యారు. తెలుగుదేశం పార్టీ 2009 ఎన్నికల్లో ఓడిపో యింది. అప్పుడు జూనియర్ ఎన్టీఆర్ ప్రచారం చేసిన నియోజకవర్గాలన్నీ ఓడిపోయాయంటూ మళ్లీ తెలుగుదేశం నాయకులు ప్రచారం మొదలు పెట్టారు. హరికృష్ణకు ప్రాదాన్యత తగ్గిస్తూ వచ్చారు. ఇంతలో ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ విడిపోయింది. రెండు రాష్ట్రాలు ఏర్పాటయ్యాయి. అనూహ్యంగా 2014 ఎన్నికల్లో ఆంధ్ర ప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీ అదికారంలోకి వచ్చింది. ఇక అప్పటి నుంచి ఎన్టీఆర్‌ను రాజకీయాల్లోకి రాకుండా అడ్డుకునే ప్రయత్నం మొదలు పెట్టారు. లోకేష్‌ను మంత్రిని చేసి, ఎమ్మెల్సీని చేశారు. ఇక తెలుగుదేశంలో హరికృష్ణ కుటుంబానికి, జూనియర్ ఎన్టీఆర్‌కు స్థానం లేకుండా చేశారు. ఇదే సమయంలో జరిగిన తెలుగుదేశం మహానాడులో హరికృష్ణను వేదికపైకి కూడా పిలువ లేదు. ఆ సమయంలో తన ఆవేదనను, ఆక్రోశాన్ని హరికృష్ణ వ్యక్తంచేశారు. తర్వాత కొంత కాలానికి హరికృష్ణ కాలం చేశారు. ఇక అప్పటి నుంచి ఎన్టీఆర్‌ను మరింత దూరం చేస్తూ వచ్చారు. బాలకృష్ణ కూతుళ్ల వివాహానికి కూడా పిలువలేదు. జూనియర్‌ను అటు సినిమాల పరంగా,ఇటు రాకీయంగా ఎదగకుండా చూసే ప్రయత్నం చేస్తూ వచ్చారు. తాజాగా తమిళనాడులో విజయ్ గెలుపు, ఎన్టీఆర్‌లో స్పూర్తిని నింపిందని తెలుస్తోంది. తన తండ్రికి తెలుగుదేశంలో జరిగిన అన్యాయం, తనకు ఇప్పటికీ జరుగుతున్న అన్యా యంపై సమరం చేయాలంటే రాజకీయమే సరైన మార్గమని అనుకుం టున్నారు. ఈ నెల 18న ఎన్టీఆర్ తన సామాజిక సేవ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నారు? అనే వార్తలు వస్తున్నాయి. ఎన్టీఆర్‌ను స్వయంగా బంధువర్గమే తొక్కేయాలని చూసినా, సీనియర్ ఎన్టీఆర్ పోలికలు వున్న జూనియర్‌ను ప్రజలు ఆదరిస్తూనే వున్నారు. ఆయన సినిమనాలను చూస్తున్నారు. ఇప్పుడున్న యువతరం కథానాయకుల్లో మొదటి వరుసలోనే వున్నారు. సినియర్ ఎన్టీఆర్ లాగా ఒక దశ వచ్చే వరకు రాజకీయాల్లోకి రాకుండా వుండే రోజులు కాదు. అప్పటి తరం వేరు. ఇప్పటి తరం వేరు. ఓ ఏడాది పాటు సినిమా లేకుంటే హీరోలనే ప్రేక్షకులుమర్చిపోతున్నారు. నాలుగు సినిమాలు పోతే చాలు, హీరోల పని అయిపోతుందని ప్రచారం చేస్తున్నారు. అయినా 60 వయసు దాకా సినిమాలు చేసి, రాజకీయాల్లోకి వచ్చినా వచ్చే లాభం పెద్దగా వుండదు. ఎన్టీఆర్ కూడా రాజకీయంగా అనేక ఒడిదొడుకులు ఎదుర్కొన్నారు. ప్రజలు ఆదరించి గెలిపించినా సొంత కుటుంబ సభ్యులే ఎన్టీఆర్‌ను పదవి నుంచి దించేశారు. అలాంటి పరిస్దితులు ఎవరికి ఎటు వైపు నుంచి వస్తాయో తెలియదు. చిరంజీవి లాంటి వారు రాజకీయాల్లో సక్సెస్ కాకపోవడానికి కూడా అదే కారణం. కేరిర్ పీక్‌లో వున్నప్పుడు సినిమాలు, తర్వాత రాజకీయాలు అనుకుంటే జనం ఆదరణ వుండదని తేలిపోయింది. అందుకే తమిళనాడులో రజినీ కాంత్ భయపడింది. అయినా కమలహాసన్ దైర్యం చేసినా, ఒక్క సీటు గెలవలేదు. అందుకే దళపతి విజయ్ 50లోనే రాజకీయాల్లోకి వచ్చారు. యువతరంలో గుర్తింపు వున్నప్పుడు పార్టీ పెట్టి జనంలోకి వచ్చారు. గెలిచారు. సరిగ్గా అదే ఫార్ములాను ఎన్టీఆర్ అనుసరించాలని చూస్తున్నారు. యంగ్ టైగర్ అనిపించుకుంటున్నప్పుడే రాజ్యమేలే అవకాశం వెత్తుక్కుంటున్నారు. ఎన్టీఆర్ రాజకీయ ప్రకటన చేస్తే, అటు తెలుగుదేశం, ఇటు వైసిపి రెండు పార్టీలు సగం ఖాళీ అవుతాయన్న లెక్కలు ఇప్పటి నుంచే వేసుకుంటున్నారు. జూనియర్‌కు రెండు పార్టీల నాయకులు పైకి చెప్పకపోయినా స్వాగతం పలుకుతున్నారు. మధ్యలో వచ్చిన నారా తరానికి చరమగీతం పాడి, నందమూరి తరం చరిత్ర తిరగరాయాలని కోరుకుంటున్నారు. తన తండ్రికి దక్కాల్సిన గౌరవం తన వల్ల తిరిగి సాధించాలని చూస్తున్నారు. చూద్దాం..ఏం జరుగుతుందో!!!



# నేటిధాత్రి

తెలుగు వార్త పత్రిక

22ND ANNIVERSARY



మంగళవారం 14-07-2026 పేజీలు : 08 CIRCULATED AT : TELANGANA and ANDHRAPRADESH STATES సంపుటి : 22 సంచిక : 95 రూ॥ 6.00





# లంచం లేనిదే పని లేదు!

- సామాన్యులను అధికంగా వేధిస్తున్న రెవెన్యూశాఖ
- పోలీసు, విద్యుత్, మున్సిపల్... ఒకటేమిటీ అన్నీ అవినీతిలో కూరుకుపోయాయి
- పైసలివ్వు పనిచేయించుకో అనే పరిస్థితి ఏర్పడింది
- కొన్ని సందర్భాల్లో ప్రభుత్వం నుంచి అందే ప్రయోజనం కంటే లంచమే ఎక్కువ!




చీఫ్ ఎడిటర్
కట్టా రాఘవేందర్ రావ్
9063524196, 9908658888


## అడుగడుగునా అవినీతి.. అల్లాడుతున్న సామాన్యుడు

## రాష్ట్రంలో అధికారుల్లో పెరిగిపోయిన అవినీతి




- అవినీతి పెరిగిపోతున్నదంటూ విపక్షాల ఆరోపణలు
- ఏసీబీ దాడుల్లో పట్టుబడిన వందలకోట్ల ఆస్తులు
- అయినా తగ్గని అవినీతి జోరు
- సామాన్యుల నడ్డి విరుస్తున్న అధికార్ల అవినీతి
- లంచాలతో కోట్లు సంపాదిస్తున్న కొందరు అధికార్లు
- బీఆర్ఎస్ ప్రభుత్వం జీతాలు పెంచినా, అదే స్థాయిలో కలెక్షన్లు కూడా పెరిగాయి

హైదరాబాద్, నేటిధాత్రి:
తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో వివిధ ప్రభుత్వ శాఖల్లో అవినీతి కార్యకలాపాలు పెరిగిపోతున్నాయంటూ ప్రతిపక్షాలు (బీఆర్ ఎస్, బీజేపీ) తీవ్ర ఆరోపణలు గుప్పిస్తుండగా, క్షేత్రస్థాయిలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) వరుస దాడులతో భారీగా అక్రమాస్తులను వెలికితీస్తోంది. ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాల వేధింపులు, వివిధ విభాగాల్లో జరుగుతున్నట్లు చెప్తున్న కుంభకోణాల వల్ల సాధారణ ప్రజలు, నిరుద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని విపక్షాలు విమ ర్శిస్తున్నాయి.

ఇటీవలి కాలంలో తెలంగాణ ఏసీబీ (యాంటీ కరప్షన్ బ్యూరో) రాష్ట్రవ్యాప్తంగా ఉన్నత స్థాయి అధికారులను లక్ష్యంగా చేసుకుని జరిపిన దాడులలో వందల కోట్ల రూపాయల అక్రమాస్తులు బయటపడ్డాయి. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (డీఎస్పీ)



శంకీరెడ్డి భీంరెడ్డి నివాసాలపై ఏసీబీ దాడులు చేసి, సుమారు 200 కోట్ల విలువైన బి నామీ ఆస్తులను గుర్తించి ఆయనను అరెస్ట్ చేసింది. హైదరాబాద్ వాటర్ బోర్డ్ జనరల్ మేనేజర్ నివాసంలో సోదాలు నిర్వహించిన అధికారులు కేజీల కొద్దీ బంగారం, వెండి మరియు రూ. 1.10 కోట్ల నగదును స్వాధీనం చేసుకున్నారు. వీటి మార్కెట్ విలువ రూ. 100 కోట్లకు పైగా ఉంటుందని అంచనా. ఆర్అండ్‌బీ ఈఎన్‌సీ జె. మోహన్ నాయక్ ఇళ్లపై జరిగిన దాడుల్లో సుమారు రూ. 200 కోట్ల విలువైన అక్రమాస్తులు వెలుగుచూశాయి. వివిధ జిల్లాల్లో సబ్-రిజిస్ట్రార్ ఆఫీసులు, తహసీల్దార్ కార్యాలయాలు మరియు మండల పరిషత్ కార్యాలయాల్లో (ఎంపీడీఓ, ఎంపీఓ) చిన్నపాటి పనులకు కూడా లంచాలు డిమాండ్ చేస్తూ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడుతున్నారు.

ప్రతిపక్ష పార్టీలైన భారత్ రాష్ట్ర సమితి, బీజేపీ సంయుక్తంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై పలు పెద్ద కుంభకోణాల ఆరోపణలు చేస్తున్నాయి. బిల్డర్లు, కాంట్రాక్టర్ల నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద ఎత్తున "ఆర్ఆర్ టాక్స్" పేరుతో సూళ్లకు పాల్పడుతోందని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. గురుకుల పాఠశాలల టెండర్లలో దాదాపు రూ. 2,000 కోట్ల మేర అవినీతి జరిగిందని, దీనిపై బహిరంగ చర్చకు తాము సిద్ధమని బీఆర్ఎస్ నేత హరీష్ రావు సవాల్ విసిరారు. నిబంధనలకు విరుద్ధం గా ముఖ్యమంత్రి బంధువులకు రూ. 1,137 కోట్ల విలువైన అమృత్ పథకం కాంట్రాక్టులను కట్టబెట్టారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ప్రభుత్వ భూములను తాకట్టు పెట్టి కార్పొరేషన్ల ద్వారా రుణాలు తీసుకునే ప్రక్రియలో మధ్యవర్తులకు వందల కోట్ల రూపాయల బ్రోకరేజ్ కమీషన్లు ఇస్తున్నారని విమర్శలు వస్తున్నాయి.







పోలీసు, విద్యుత్, రెవెన్యూశాఖ మున్సిపల్...

ఈ అవినీతి మరియు పరిపాలనా లోపాల వల్ల సామాన్య ప్రజలు, రైతులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని నివేదికలు తెలుపుతున్నాయి. రైతుబంధు, రైతుబీమా వంటి పెట్టుబడి సహాయాలు సకాలంలో అందడం లేదని, రుణమాఫీ ప్రక్రియలోనూ జాప్యం జరుగుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దాదాపు 30 లక్షల మంది విద్యార్థులకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో, ప్రైవేట్ కళాశాలలు విద్యా ర్థుల సర్టిఫికేట్లను నిలిపివేస్తున్నాయి. సామాన్యులు ఇళ్ల అనుమతులు, భూముల రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్లు లేదా చిన్నపాటి ప్రభుత్వ ధృవీకరణ పత్రాల కోసం వెళ్లినప్పుడు లంచాలు ఇస్తేనే పనులు జరుగుతున్నాయని ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి. ఆర్టీఏ ఫీజులు, పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ ఛార్జీలు, రిజిస్ట్రేషన్ ఛార్జీలు పెరగడం వల్ల మధ్యతరగతి మరియు పేద కుటుంబాలపై అదన పు భారం పడింది. ఈ ఆరోపణలను కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్రంగా ఖండిస్తోంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన కాళేశ్వరం ప్రాజెక్టు వంటి భారీ అవినీతి నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే విపక్షాలు ఇలాంటి అవాస్తవ ఆరోపణలు చేస్తున్నాయని అధికార పక్షం వాదిస్తోంది.

ప్రభుత్వ కార్యాలయాల్లో పేరుకుపోయిన అవినీతి, లంచగొండితనం వల్ల సామాన్య మానవుడి దైనందిన జీవితం నరకప్రాయంగా మారుతోంది. చిన్నపాటి అవసరాల కోసం కూడా ప్రభుత్వ ఆఫీసుల చుట్టూ తిరగాల్సి రావడం, లంచం ఇవ్వనిదే పనులు కాకపోవడంతో ప్రజలు మానసికంగా, ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్ల అనుమతులు , భూముల రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్లు లేదా రేషన్ కార్డుల వంటి ప్రాథమిక అవసరాల కోసం కూడా అధికారులు లంచాలు డిమాండ్ చేస్తున్నారు. సామాన్యులు తమ సొంత ఇల్లు లేదా భూమి సమస్యలను పరిష్కరించుకోవడానికి, అధికారులు అడిగిన లంచం డబ్బును సర్దలేక వడ్డీలకు అప్పులు చేయాల్సిన పరిస్థితి వస్తోంది. ఇళ్ల స్థలాలు, ఉచిత గృహాలు (ఇందిరమ్మ ఇళ్లు), పింఛన్లు మరియు ప్రభుత్వ ఆర్థిక స హాయాలు నిజమైన పేదలకు అందడం లేదు. లంచాలు ఇచ్చిన వారికే ఈ పథకాలు దక్కుతున్నా యి. ప్రభుత్వ ఆసుపత్రులలో ఉచిత వైద్యం అందాలన్నా, ప్రసవాలు జరగాలన్నా, సర్జరీలు కా వాలన్నా క్షేత్రస్థాయి సిబ్బందికి "మామూళ్లు" ఇచ్చుకోవాల్సి వస్తోంది. డబ్బులు లేని పేదలు ప్రాణాలు కోల్పోయే పరిస్థితులు వస్తున్నాయి. లంచం ఇవ్వడానికి నిరాకరించే సామాన్యుల ఫైళ్లను అధికారులు నెలల తరబడి పక్కన పెడుతున్నారు. దీనివల్ల ప్రజలు తమ రోజువారీ కూలీని, ప నులను వదులుకుని ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోంది. తప్పు చేయకపోయినా, ఒక చిన్న సంతకం లేదా సర్టిఫికేట్ కోసం అధికారుల ముందు చేతులు కట్టుకుని నిలబడాల్సి రావడం, వారి దురుసు ప్రవర్తనను భరించడం వల్ల సామాన్యుడు తీవ్ర మానసిక క్షోభకు గురవుతున్నాడు. విద్యార్థులకు అవసరమైన కుల, ఆదాయ, నివాస ధృవీకరణ పత్రాలు సకాలంలో అందకపోవడంతో స్కాలర్‌షిప్‌లు, కాలేజీ అడ్మిషన్లు కోల్పోతున్నారు. ఉద్యోగ నియామకాల్లో అవినీతి వల్ల రాత్రింబగళ్లు కష్టపడి చదివే నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు రావడం లేదు. డబ్బున్న వారికే పోస్టులు దక్కడంతో ప్రతిభావంతులైన యువత తీవ్ర నిరాశలో మునిగిపోతున్నారు. రోడ్ల నిర్మాణం, డ్రైనేజీలు, ప్రభుత్వ భవనాల కాంట్రాక్టులలో అధికారులు భారీగా కమీషన్లు (పర్సంటేజీలు) నొక్కేయడం వల్ల కాంట్రాక్టర్లు నాసిరకం పనులు చేస్తున్నారు. దీనివల్ల వర్షం పడితే రోడ్లు గుంతలమయమై ప్రమాదాలు జరగడం, మురుగునీరు ఇళ్లలోకి రావడం వంటి సమస్యలతో సామాన్యుడే ఇబ్బంది పడుతున్నాడు. ప్రభుత్వ వ్యవస్థలలోని లంచగొండితనం కేవలం డబ్బు కోల్పోవడమే కాదు, సామాన్య మానవుడి నమ్మకాన్ని, ప్రశాంతతను మరియు గౌరవప్రదమైన జీవితాన్ని పూర్తిగా నాశనం చేస్తోంది.




## అక్రమ రిజిస్ట్రేషన్లకు కేరాఫ్ అడ్రస్?

### కాసు ముట్టిందంటే ఎలాంటి కన్వర్షన్ అయినా ఓకే?

- లంచం తీసుకుంటున్నామన్న భయము లేదు?
- "ఏసీబీ" అధికారులే తన మిత్రులట?
- ఇప్పటికే వందల కోట్లు ఆస్తి దాటిన అధికారి?
- పై అధికారులను ప్రసన్నం చేసుకోవడంలో మహా జాదుగాడు?
- ఒక్కటి కాదు రెండు కాదు ఏకంగా నాలుగు నెలల్లో 42 అక్రమ రిజిస్ట్రేషన్లు చేశాడు?
- గతంలో ఈ అధికారిపై ఎన్నో అవినీతి ఆరోపణలు ఆదాయానికి మించిన ఆస్తులు?
- తప్పుడు రిజిస్ట్రేషన్ లంటే తహతహలాడుతాడు?

**త్వరలో**

సామాన్యుడిని అత్యధికంగా వేధించేది రెవెన్యూ శాఖ. ఒక చిన్న భూమి రికార్డు మార్పు కోసం కూడా వేలల్లో, లక్షల్లో లంచాలు డిమాండ్ చేస్తున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయి. భూమి కొనుగోలు చేసిన తర్వాత రికార్డుల్లో పేరు మార్చడానికి (మ్యుటేషన్), కొత్త పట్టాదార్ పాస్ బుక్ జారీ చేయడానికి తహసీల్దార్ కార్యాలయాల్లో తీవ్ర జాప్యం చేస్తూ లంచాలు ఆశిస్తున్నారు. సొంత భూమిని కొలవడానికి, హద్దులు నిర్ణయించడానికి విలేజ్ రెవెన్యూ అధికారులు నెలల తరబడి తిప్పుకుంటున్నారు. గత రికార్డుల్లో జరిగిన తప్పులను సవరించడానికి (ప్రొహిబిటెడ్ జాబితా నుండి తొలగించడానికి) ఉన్నతాధికారుల స్థాయి వరకు భారీగా లంచాలు చేతులు మారుతున్నాయి. పట్టణ ప్రాంతాల్లో ఇల్లు కట్టుకోవాలన్నా లేదా వ్యాపారం ప్రారంభించాలన్నా మున్సిపల్ అధికారుల లంచాల వేధింపులు తప్పడం లేదు. సామాన్యుడు చట్టబద్ధంగా ఇల్లు కట్టుకోవడానికి దరఖా స్తు చేసుకున్నా, ప్లాన్ అప్రూవల్ కోసం మున్సిపల్ ఇంజనీర్లు, ప్లానింగ్ అధికారులు వేల రూపాయల లంచం అడుగుతున్నారు. నిబంధనలు ఉల్లంఘించి కట్టే కట్టడాలను కూల్చివేయకుండా ఉండేందుకు మున్సిపల్ సిబ్బంది నెలవారీ మామూళ్లు వసూలు చేస్తున్నారు. ఇల్లు పూర్తయిన త ర్వాత ఆక్యుపెన్సీ సర్టిఫికేట్ ఇవ్వడానికి, వ్యాపారాలకు లైసెన్స్ జారీ చేయడానికి మరియు నల్లా కనెక్షన్ ఇవ్వడానికి లంచాలు డిమాండ్ చేస్తున్నారు.

న్యాయం కోసం వెళ్లిన బాధితుల నుంచి కూడా లంచాలు ఆశించడం ఈ శాఖలో ప్రధాన సమస్యగా మారింది. ఏదైనా నేరం లేదా గొడవ జరిగినప్పుడు పోలీస్ స్టేషన్‌లో కేసు (ఎఫ్ ఐఆర్) నమోదు చేయడానికే బాధితుల నుంచి డబ్బులు ఆశిస్తున్నారు. పాస్‌పోర్ట్ వెరిఫికేషన్ కోసం లేదా ప్రభుత్వ ఉద్యోగాల వెరిఫికేషన్ కోసం ఇంటికి వచ్చే కానిస్టేబుళ్లు ఖచ్చితంగా "మామూళ్లు" ఇ వ్వాలని ఒత్తిడి తెస్తున్నారు. చిన్న చిన్న కేసుల్లో స్టేషన్ బెయిల్ ఇవ్వడానికి, కోర్టులో ఛార్జ్ షీట్ త్వరగా దాఖలు చేయడానికి లేదా కేసు తీవ్రతను తగ్గించడానికి నిందితుల నుండి భారీగా వసూళ్లకు పాల్పడుతున్నారు. రోడ్లపై వాహనాలను ఆపి, చిన్న తప్పులకే భారీ జరిమానాలు వేస్తామని భయపెట్టి, తక్కువ డబ్బులతో సెటిల్ చేసుకోవాలని హోంగార్డులు, కానిస్టేబుళ్లు లంచాలు తీసు కుంటు న్నారు. ఈవిధంగా అన్ని శాఖల్లో లంచాల వసూళ్లు విపరీతం కావడంతో సామాన్యుల జీవితం దుర్భర మవుతోంది. ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లాలంటేనే జంకే పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వంతో ముడిపడిన ప్రతి సేవకు లంచం ఇవ్వనిదే పనికావడంలేదు. దీనికి పరిష్కారం కూడా లభించే పరిస్థితి లేకపోవడం విషాదం. అవినీతిపై ఏసీబీకి ఫిర్యాదు చేయవచ్చు. అడుగడుగునా జరుగుతున్న అవినీతిపై ప్రతి అంశంపై ఫిర్యాదు చేయడం సామాన్యుడికి అయ్యే పనేనా? అవినీతికి పాల్పడే ఉద్యోగులు అన్ని జాగ్రత్తలూ తీసుకొని ఎప్పటికప్పుడు కొత్త పద్ధతుల్లో లంచాలు తీసుకుంటుండ టంతో ఇదొక పెద్ద జాడ్యంగా మారిపోయింది. అన్ని స్థాయిల్లో ఎవరికి తగిన విధంగా వారు లంచాలు మెక్కుతుండటంతో ఇదొక అంతూపం తూలేని మహమ్మారిగా మారింది. సామాన్యుడికి ఈ బాధనుంచి విముక్తి లభిస్తుందన ఆశకూడా వుండటంలేదు.









నిష్పక్షపాత వార్తల నిలయం

22ND ANNIVERSARY
వసంతాల అక్షరోద్యమం

# నేటిధాత్రి®
తెలుగు వార్త పత్రిక



మంగళవారం 14-07-2026 పేజీలు : 08 CIRCULATED AT : TELANGANA and ANDHRAPRADESH STATES సంపుటి : 22 సంచిక : 95 రూ॥ 6.00


## విద్యలో కులవివక్షకు చెక్: సీఎం రేవంత్



హైదరాబాద్, నేటిధాత్రి :
విద్యార్థుల్లో కులవివక్షను నిర్మూలించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక చర్యలు చేపడుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్ కిషోర్ మక్వానాతో భేటీలో ఆయన మాట్లాడుతూ, ప్రతి నియోజకవర్గంలో 25 ఎకరాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల ద్వారా నర్సరీ నుంచి ఇంటర్ వరకు నాణ్యమైన విద్య, అల్పాహారం, మధ్యాహ్న భోజనం, రవాణా సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు. ఎస్సీలకు జనాభా శాతం కంటే అధిక అవకాశాలు కల్పిస్తున్నామని, ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తున్నామని పేర్కొన్నారు.

## టీజీటెట్ ఫలితాలు విడుదల..
## 43.94% ఉత్తీర్ణత



హైదరాబాద్, నేటిధాత్రి:
టీజీటెట్--జూన్ 2026 ఫలితాలను పాఠశాల విద్యాశాఖ విడుదల చేసింది. మొత్తం 1,15,028 మంది పరీక్ష రాయగా, 50,544 మంది అర్హత సాధించారు. మొత్తం ఉత్తీర్ణత శాతం 43.94గా నమోదైంది. ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయుల కోసం ప్రత్యేక టీజీటెట్ నోటిఫికేషన్‌ను జూలై 21న విడుదల చేసి, పరీక్షలను సెప్టెంబర్ 7 నుంచి 11 వరకు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఇకపై ప్రతి ఏడాది మొత్తం నాలుగు టెట్ పరీక్షలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

## సింగరేణిపై బీఆరఎస్, కాంగ్రెస్‌పై కిషన్‌రెడ్డి విమర్శలు



భద్రాద్రి కొత్తగూడెం, నేటిధాత్రి:
సింగరేణిని బీఆరఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు భ్రష్టు పట్టించాయని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆరోపించారు. గతంలో డబ్బులు తీసుకుని మైన్స్ కేటాయించారని, ఇప్పుడు కూడా సింగరేణిని రాజకీయాల కోసం ఉపయోగిస్తున్నారని విమర్శించారు. మోదీ ప్రభుత్వం వేలం లేకుండా తాడిచర్ల--2 బొగ్గు బ్లాక్‌ను సింగరేణికి కేటాయించిందని,సంస్థ అభివృద్ధికి కేంద్రం అండగా నిలుస్తోందని అన్నారు.

## అయోధ్య విరాళాల చోరీపై సిట్ నివేదిక కోరిన సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ, నేటిధాత్రి:
అయోధ్య రామాలయ విరాళాల చోరీ కేసులో ఇప్పటివరకు జరిగిన దర్యాప్తుపై నివేదిక సమర్పించాలని సుప్రీంకోర్టు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఆదేశించింది. కేంద్రం, ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం, శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టుకు నోటీసులు జారీ చేసిన ధర్మాసనం, కేసు తదుపరి విచారణను జూలై 20కి వాయిదా వేసింది.

- నాడెం నాలా దురాక్రమణకు పాల్పడ్డ బిల్డర్లు?
- వరద ప్రవాహనికి అడ్డుకట్ట... నీట మునుగుతున్న కాలనీలు!
- ఇరిగేషన్, హెచ్ ఎమ్ డిఎ అనుమతులపై బహిరంగ విచారణ చేపట్టాలి !
- హైడ్రా, ఇరిగేషన్ శాఖల మౌనం వెనుక మతలబేంటి?
- హరిహరస్ లో ఫ్లాట్లు కొనుగోలు చేస్తే ఫట్టేనా!

# హరి హరస్ అరాచకం!

ఘట్కేసర్ సర్కిల్, పోచారం వార్డు పరిధిలోని జోడిమెట్ల చౌరస్తా వద్ద నిర్మిస్తున్న "హరిహరస్ శ్రీ కాకతీయ" హైరైజ్ ప్రాజెక్టుకు అనుమతులు లభించిన తీరు తీవ్ర విస్మయానికి గురిచేస్తోంది. ఇక్కడి నాడెం నాలా ఉనికిని దెబ్బతీస్తూ, మట్టితో పూడ్చివేసి, సహజ నీటి ప్రవాహాన్ని పూర్తిగా మళ్లించారనే ఆరోపణలు ఒకవైపు వెల్లువెత్తుతుంటే.. మరోవైపు అస్సలు ఇరిగేషన్ శాఖ ఏ నిబంధనల ఆధారంగా వీరికి ఎన్ఓసీ జారీ చేసిందనేది ఎవరికీ అర్థం కాని ప్రశ్నగా మిగిలింది. నాలా బఫర్ జోన్ పరిరక్షణను పర్యవేక్షించాల్సిన ఇరిగేషన్ విభాగం పచ్చజెండా ఊపడం, దాన్ని బేస్ చేసుకుని హెచ్ఎండీఏ అంతటి భారీ నిర్మాణాలకు అనుమతులు ఎలా మంజూరు చేసిందనే అంశాలపై ఇప్పుడు తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే సమీప కాలనీలు ముంపునకు గురవుతున్నాయని బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ అనుమతుల వెనుక ఉన్న మతలబు ఏంటని సర్వత్రా అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. దీని వెనుక ఉన్న అధికారుల పాత్రపై 'హైడ్రా' ప్రత్యేకంగా దృష్టి సారించి, సమగ్ర విచారణ జరపాలని స్థానికులు, ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.




నాలా డైవర్షన్

## పోచారంలో 3.09 ఎకరాల్లో 360 ఫ్లాట్ల భారీ ప్రాజెక్టు!





నాలాపై నిర్మించిన 15 అంతస్తుల బహుళ నిర్మాణం

నేటిధాత్రి, స్పెషల్ టాస్క్ ఫోర్స్:
మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్ సర్కిల్ పోచారం వార్డ్ పరిధిలోని జోడిమెట్ల చౌరస్తా వద్ద 'హరిహరస్ శ్రీ సాయి కాకతీయ' పేరుతో నిర్మితమవుతున్న భారీ హైరైజ్ ప్రాజెక్టు ప్రస్తుతం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. నాడెం చెరువుకు అనుసంధానంగా ఉన్న సహజ నీటి ప్రవాహ మార్గాన్ని ఆక్రమించి, నాలా ఆనవాళ్లను చెరిపివేస్తూ బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపడుతున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. కోట్ల రూపాయల వ్యాపార ప్రయోజనాల కోసం ప్రకృతి సిద్ధమైన నీటి మార్గాలనే మింగేస్తే భవిష్యత్తులో పరిస్థితి ఏమిటనే ఆందోళన స్థానిక ప్రజల్లో వ్యక్తమవుతోంది.

### భారీ ప్రాజెక్టు... అంతకుమించిన అనుమానాలు!

నిర్మాణ సంస్థ ప్రచార వివరాల ప్రకారం, 'హరిహరస్ శ్రీ సాయి కాకతీయ' ప్రాజెక్టు సుమారు 3.09 ఎకరాల విస్తీర్ణంలో అభివృద్ధి చెందుతోంది. ఇందులో 15 అంతస్తుల చొప్పున రెండు భారీ టవర్లు నిర్మించబడుతున్నాయి. మొత్తం 360 ఫ్లాట్లు ఉండగా, 1,335 నుంచి 1,600 చదరపు అడుగుల విస్తీర్ణంలో 2 బీహెచ్‌కే, 3 బీహెచ్‌కే అపార్ట్‌మెంట్లు విక్రయానికి అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు సంస్థ ప్రచారం చేస్తోంది.

అయితే స్థానికులు లేవనెత్తుతున్న ప్రశ్న మాత్రం ఒక్కటే. సహజ నీటి ప్రవాహ మార్గానికి అత్యంత సమీపంలో, నాలా పరిధిలోనే ఉన్న ప్రాంతంలో ఇంత భారీ నిర్మాణాలకు అనుమతులు ఎలా లభించాయి? నిర్మాణాలకు ముందు క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలన జరిగిందా? లేక అధికార యంత్రాంగం కళ్ళు మూసుకుందా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

### నాడెం నాలా మాయం?

స్థానికుల ఆరోపణల ప్రకారం, గతంలో నాడెం చెరువుకు సంబంధించిన ప్రధాన నాలా ఈ ప్రాంతం గుండా ప్రవహించేది. వర్షాకాలంలో చెరువులోకి చేరే అదనపు నీరు ఈ నాలా ద్వారా దిగువ ప్రాంతాలకు వెళ్లేది. అయితే ప్రస్తుతం ఆ నాలా ఆనవాళ్లు గుర్తుపట్టలేని పరిస్థితి నెలకొన్నట్లు చెబుతున్నారు. నాలాను మట్టితో పూడ్చివేసి, నీటి ప్రవాహాన్ని మళ్లించి నిర్మాణాలు చేపట్టినట్లు ఆరోపిస్తున్నారు.

ఇరిగేషన్ చట్టాలను తుంగలో తొక్కి, సహజంగా ప్రవహించే నీటి ప్రవాహాలను క్రమంగా కనుమరుగుచేసి వాటిపై బహుళ కాంక్రీట్ నిర్మాణాలు నిర్మిస్తే దాని మూల్యం సామాన్య ప్రజలే చెల్లించాల్సి వస్తుందని పర్యావరణ వేత్తలు హెచ్చరిస్తున్నారు. ఒకప్పుడు నీరు పారే మార్గంలో ఇప్పుడు భారీ టవర్లు వెలిసిపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది.

### నీట మునుగుతున్న కాలనీలు

నాడెం నాలా ప్రవాహానికి ఆటంకాలు ఏర్పడిన తరువాతే పరిసర ప్రాంతాల్లో ముంపు సమస్యలు పెరిగాయని స్థానికులు చెబుతున్నారు. ముఖ్యంగా హిమగిరి కాలనీ, డాక్టర్స్ కాలనీ, మహేంద్రహిల్స్ ప్రాంతాలు చిన్నపాటి వర్షాలకే నీట మునుగుతున్నాయని ఆరోపిస్తున్నారు. కొద్దిపాటి వర్షానికే రోడ్లు చెరువులను తలపిస్తున్నాయని, ఇళ్లలోకి నీరు చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయా కాలనీ వాసులు వాపోతున్నారు.

భారీ వర్షాలు కురిసే పరిస్థితుల్లో భవిష్యత్తులో మరింత ప్రమాదం సంభవించే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కోట్ల రూపాయల ప్రాజెక్టులను కాపాడేందుకు ప్రజల ప్రాణాలను పణంగా పెడుతున్నారా అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

### అనుమతుల వెనుక అసలు కథ ఏమిటి?

ఈ ప్రాజెక్టుకు సంబంధించిన అనుమతుల వ్యవహారం కూడా ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. నాలా, ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్, ప్రభుత్వ భూములు, నీటి ప్రవాహ మార్గాలకు సంబంధించి పూర్తి స్థాయి పరిశీలన నిర్వహించిన తరువాతే సంబంధిత శాఖలు అనుమతులు జారీ చేయాల్సి ఉంటుంది. కానీ ఈ ప్రాజెక్టు విషయంలో నిజంగా అలాంటి పరిశీలన జరిగిందా లేదా అనే అంశంపై ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

ఇరిగేషన్ శాఖ, రెవెన్యూ శాఖ, హెచ్ఎండీఏ, మున్సిపల్ అధికారులు సంయుక్త సర్వే నిర్వహించారా? నిర్వహించి ఉంటే ఆ నివేదిక ఏమి చెబుతోంది? నాలా ఉనికిని గుర్తించారా? గుర్తించి ఉంటే నిర్మాణాలకు అనుమతులు ఎలా ఇచ్చారు? అనే ప్రశ్నలకు అధికారులు సమాధానం చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడింది.

### హైడ్రా ఎందుకు మౌనం వహిస్తోంది?

రాష్ట్రవ్యాప్తంగా చెరువులు, కుంటలు, నాలాలు, ప్రభుత్వ భూముల ఆక్రమణలపై హైడ్రా దూకుడు చర్యలు చేపడుతోంది. అనేక చోట్ల భారీ నిర్మాణాలను సైతం కూల్చివేస్తూ చట్టాన్ని అమలు చేస్తోంది. అయితే ఘట్కేసర్ సర్కిల్ పోచారం డివిజన్ పరిధిలో ఇంత పెద్ద ఎత్తున ఆరోపణలు వస్తున్నప్పటికీ హైడ్రా ఇప్పటివరకు స్పందించకపోవడం స్థానికులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది.

నాలా ఆక్రమణ జరిగిందా లేదా అన్న అంశాన్ని హైడ్రా స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలించి వాస్తవాలను వెలుగులోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు. అవసరమైతే ఉపగ్రహ చిత్రాలు, పాత సర్వే మ్యాపులు, రెవెన్యూ రికార్డులు, ఇరిగేషన్ శాఖ పత్రాలను పరిశీలించాలని డిమాండ్ చేస్తున్నారు.




### ఫ్లాట్ల కొనుగోలుదారుల్లో పెరుగుతున్న ఆందోళన!

ప్రాజెక్టుపై వస్తున్న ఆరోపణలు ఇప్పటికే ఫ్లాట్లు కొనుగోలు చేసిన వారిలో, కొనుగోలు చేయాలనుకుంటున్న వారిలో ఆందోళనకు దారితీస్తున్నాయి. భవిష్యత్తులో ఏవైనా న్యాయపరమైన చిక్కులు, ప్రభుత్వ చర్యలు, లేదా ముంపు సమస్యలు తలెత్తితే పరిస్థితి ఏమిటనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. సంబంధిత శాఖలు పూర్తి స్థాయి స్పష్టత ఇవ్వాలని పలువురు కోరుతున్నారు.

## సుప్రీం సాక్షిగా బయటపడ్డ రేవంత్ వైఫల్యం
### -మరోమారు మండిపడ్డ బీఆర్ఎస్ నేత హరీష్‌రావు



సంగారెడ్డి, నేటిధాత్రి:
రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలు సుప్రీంకోర్టు సాక్షిగా బయటపడ్డాయని మాజీ మంత్రి హరీష్‌రావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. సంగారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మొదటి నుంచి రాజకీయ కాంక్ష తప్ప రాష్ట్ర ప్రయోజనాలు పట్టవని ధ్వజమెత్తారు. తన రాజకీయ గురువు చంద్రబాబు కోసం గురుప్రదక్షిణ చేయడానికే సీఎం రేవంత్ ఆరాటపడుతున్నారని విమర్శించారు.

గోదావరి--నల్లమల కేసులో సుప్రీంకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి గట్టి మొట్టికాయలు వేసిందని, కావాలనే లోపాలతో కూడిన కేసు వేయడం వల్లే అది నిలవదని ఉన్నత న్యాయమూర్తులు చెప్పారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏదో చేస్తున్నట్లు చూపించుకోవడానికి బ్యాక్‌డేట్ ఉత్తరాలు రాసిందని ఎద్దేవా చేశారు. గోదావరి--బనకచర్ల విషయంలో తెలంగాణకు అన్యాయం జరుగుతుందని మొదటి నుంచి బీఆర్ఎస్ హెచ్చరిస్తూనే ఉందని హరీష్‌రావు తెలిపారు. చంద్రబాబుతో రేవంత్ కుమ్మక్కయ్యారని చెప్పడానికి ఇంకేం ఆధారాలు కావాలని ప్రశ్నించారు. 'నువ్వు కొట్టినట్టు చేయ్.. నేను తిట్టినట్టు చేస్తా' అన్నట్లుగా రేవంత్ డ్రామాలు ఆడుతున్నారని విమర్శించారు. రేవంత్ కేవలం ఉద్యమ ద్రోహినే కాదు, తెలంగాణకు జలద్రోహిగా కూడా మారిపోయారని ఘాటు వ్యాఖ్యలు చేశారు.

గోదావరి-నల్లమల సాగర్ ప్రాజెక్టుపై ఆంధ్రప్రదేశ్ టెండర్లను 2025 డిసెంబర్ 11న పూర్తి చేసిందని, దానిపై కాంగ్రెస్ ప్రభుత్వం 2025 డిసెంబర్ 16న రిట్ పిటిషన్ వేసిందని గుర్తు చేశారు. అది కొట్టివేయబడిన తర్వాత గత ఏడు నెలలుగా ప్రభుత్వం ఏం చేస్తోందని ప్రశ్నించారు. కర్ణాటకలో ముగ్గురు ముఖ్యమంత్రుల అజెండా ఏమిటో రేవంత్‌రెడ్డి బయటపెట్టాలని డిమాండ్ చేశారు. 'ఎన్ఓసీ' పేరిట తెలంగాణ ప్రయోజనాలను ఏపీకి అమ్ముకుం టున్నారని ఆరోపించారు. దీనిపై అసెంబ్లీని సమావేశపరిచి చర్చిం చాలని, దొంగచాటుగా వ్యవహరిస్తే తాము ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు. సమ్మక్క బ్యారేజీలో నీరు నిల్వ చేసుకుంటే పంపింగ్ చేసుకోవచ్చని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెబుతున్నారని ఎద్దేవా చేశారు. అసలు సమ్మక్క బ్యారేజీని నిర్మించింది ఎవరో భట్టి సమాధానం చెప్పాలని, కేసీఆర్ హయాంలో నిర్మించిన ప్రాజెక్టులను వినియోగించుకోవడం కూడా కాంగ్రెస్ ప్రభుత్వానికి చేతకావడం లేదని మండిపడ్డారు.

## మిట్టపల్లి సురేందర్‌కు దాశరథి ప్రజా సాహిత్య పురస్కారం



- తెలంగాణ చైతన్యానికి దాశరథి సాహిత్యం చిరస్థాయి దీప్తి
- జస్టిస్ జి. రాధారాణి చేతుల మీదుగా పురస్కారం ప్రదానం
- "ప్రజల పక్షానే నా కలం, నా పాట" మిట్టపల్లి సురేందర్

హైదరాబాద్, నేటిధాత్రి:
మాభూమి సాహితీ సాంస్కృతిక చైతన్య వేదిక ఆధ్వర్యంలో ప్రముఖ కవి, గాయకుడు మిట్టపల్లి సురేందర్‌కు డా. దాశరథి రంగాచార్య ప్రజా సాహిత్య పురస్కారం ప్రదానం చేశారు. వనస్థలిపురంలో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ జి. రాధారాణి పురస్కారాన్ని అందజేశారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తెలంగాణ చైతన్యానికి దాశరథి సాహిత్యం చిరస్థాయిగా నిలిచిందని అన్నారు. ప్రముఖ నటుడు సుమన్ సాహిత్యం సమాజంలో సమైక్యతను పెంపొందిస్తుందని పేర్కొన్నారు. పురస్కార గ్రహీత మిట్టపల్లి సురేందర్ మాట్లాడుతూ ప్రజల బాధలు, అన్యాయాలే తన పాటలకు ప్రేరణ అని, ప్రజల పక్షాన తన కలం ఎప్పటికీ కొనసాగుతుందని తెలిపారు.

## తెలంగాణ అమరవీరుడు కానిస్టేబుల్ కిష్టయ్య కుటుంబాన్ని పరామర్శించిన కేటీఆర్



కరీంనగర్, నేటిధాత్రి: తెలంగాణ సాధన కోసం అమరుడైన కానిస్టేబుల్ కిష్టయ్య కుటుంబాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సోమవారం పరామర్శిం చారు. కరీంనగర్‌లో కిష్టయ్య నివాసానికి వెళ్లి అమరవీరుడు కిష్టయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, తెలంగాణ ఉద్యమంలో ఆయన చేసిన త్యాగాలను స్మరించు కున్నారు. మనవడు వేదాంత్ రాఘవ కిష్టయ్యను ఆశీర్వదించి, కూతురు డాక్టర్ ప్రియాంక మెడిసిన్ పీజీ విద్య కోసం కేసీఆర్ ఇచ్చిన చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా కిష్టయ్య సతీమణి పద్మావతి, కుమారుడు రాహుల్, కోడలు వర్ష , కుమార్తె డాక్టర్ ప్రియాంకలతో కేటీఆర్ ఆత్మీయంగా మాట్లాడి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఇటీవల జన్మించిన కిష్టయ్య మనవడు బేబీ వేదాంత్ రాఘవ కిష్టయ్యను కేటీఆర్ ఆశీర్వదించారు. చిన్నారికి వస్త్రాలు, కానుకలు అందజేయడంతో పాటు, కిష్టయ్య పేరులోని కె అక్షరంతో రూపొందించిన ప్రత్యేక లాకెట్‌ను బహూకరించారు. తమ ఇంటికి వచ్చి పరామర్శించి, మనవడిని ఆశీర్వదించి, కుటుంబానికి ధైర్యం చెప్పడంతో పాటు కుమార్తె విద్యకు ఆర్థిక సాయం అందించిన కేటీఆర్‌కు కిష్టయ్య కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి గంగుల కమలాకర్, ఎమ్మెల్యేలు కౌశిక్ రెడ్డి, డా సంజయ్ కల్వకుంట్ల, బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ జీవన్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మాజీ మంత్రి హరీష్ రావు,ఎమ్మెల్యే మాణిక్ రావు

**జహీరాబాద్, నేటిదాత్రి:** జహీరాబాద్ నియోజకవర్గ మాజీ మున్సిపల్ చైర్మన్ తంజిం జన్మదిన సందర్భంగా శాలువ తో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన సిద్దిపేట్ ఎమ్మెల్యే మాజీ మంత్రివర్యులు, అసెంబ్లీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్,సిద్దిపేట శాసనసభ్యులు తన్నీరు హరీష్ రావు శాసనసభ్యులు కొనింటి మాణిక్ రావు ,మాజీ డిసిఎంఎస్ చైర్మన్ శివకుమార్, మాజీ సి డి సి చైర్మన్ ఉ మాకాంత్ పాటిల్, కౌన్సిలర్ దీపక్ అప్పి, నాయకులు తదితరులు.



# నూతన మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేసిన ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి

**పరకాల, నేటిధాత్రి:** పరకాల నూతన మున్సిపల్ కమిషనర్ పోతరాజు పవన్‌ను ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఏకు శంకర్ మాదిగ సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు.అనంతరం పట్టణంలోని ప్రజా సమస్యలపై వినతిపత్రాన్ని అందజేశారు.పట్టణంలోని అన్ని వార్డుల్లో రోడ్లు,ఫుట్‌పాత్‌లు,డ్రైనేజీలపై ఉన్న అక్రమ నిర్మాణాలను తొలగించాలని,వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పారిశుధ్య చర్యలు చేపట్టి బ్లీచింగ్ పౌడర్ చల్లడం,ఫాగింగ్ నిర్వహించడం, దళిత కాలనీల్లో పరిశుభ్రతను మెరుగుపరచాలని కోరారు.అలాగే అసంపూర్తిగా ఉన్న రోడ్లు,డ్రైనేజీ పనులు పూర్తి చేయడంతో పాటు పారిశుద్ధ్య కార్మికులకు సేఫ్టీ కిట్లు,అవసరమైన సౌకర్యాలు కల్పించాలని కమిషనర్‌ను విజ్ఞప్తి చేశారు.



# మోరంచపల్లిలో రేషన్ షాప్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే జిఎస్ఆర్

**భూపాలపల్లి, నేటిధాత్రి:** భూపాలపల్లి మండలం మోరంచపల్లి గ్రామంలో నూతన రేషన్ షాప్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్యఅతిథిగా హాజరై రేషన్ షాప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గత బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలకు సన్నబియ్యం పంపిణీ చేస్తే ఖర్చు ఎక్కువ అవుతుందని చెప్పి లబ్ధిదారులను మోసం చేసిందని, నాణ్యతలేని దొడ్డు బియ్యాన్ని మాత్రమే పంపిణీ చేసిందని విమర్శించారు. కానీ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ, అర్హులైన ప్రతి పేద కుటుంబానికి నాణ్యమైన సన్నబియ్యం అందేలా పంపిణీ కార్యక్రమాన్ని అమలు చేస్తోందని తెలిపారు. ప్రజల ఆహార భద్రతకు కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, సంక్షేమ పథకాల ఫలాలు ప్రతి అర్హుడికి చేరేలా ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని ఎమ్మెల్యే గారు పేర్కొన్నారు. కార్యక్రమంలో మొరంచపల్లి సర్పంచ్ నరెడ్ల తిరుపతి రెడ్డి, శ్యాంనగర్ సర్పంచ్ ఒరుగంటి రజిత--బాబూరావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చాడ రఘునాథ్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ నూకల నరసింహారెడ్డి, ఉపసర్పంచ్ రాజమౌళి, రేషన్ డీలర్ చుక్క కవిత, ఆర్ఏ రామస్వామి, జీపీఓ కృష్ణమూర్తితో పాటు ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



# సర్ పత్రాల ధ్రువీకరణ కార్యక్రమాన్ని సద్వినియోగపరచుకోవాలి

## 29 వ వార్డు కౌన్సిలర్ వేముల సాంబయ్య గౌడ్....

**నర్సంపేట, నేటిధాత్రి:** నర్సంపేట పట్టణంలోని 29 డివిజన్ పరిధిలో బూత్ నెంబర్ 159, 160, 161 బూతులకు చెందిన బిఎల్ఓ, బిఎల్ఎలు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొని ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ మాజీ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్య గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని ప్రజలందరూ సర్ కార్యక్రమం ద్వారా ఓటరు సవరణ సకాలంలో చేసుకుని దేశ పౌరులుగా నిరూపించుకోవాలని లేనిపక్షంలో ఓటు కోల్పోవడం ద్వారా ప్రభుత్వ పథకాలను కోల్పోతారని అన్నారు.ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఓటు ఉన్నప్పుడు ఒకటి మార్చుకొని ఒకటి మాత్రమే ఉంచుకోవాలని ఒక్క వ్యక్తికి రెండు చోట్ల ఓటు ఉంటే వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని కావున ప్రజలు గమనించాలని కోరారు.కార్యక్రమంలో 159 బిఎల్వోలు కక్కెర్ల దేవమణి, మూల త్రివేణి,బొంకూరు హైమావతి 29వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తోకల శ్రీనివాస్, నాంపల్లి వెంకటేశ్వర్లు గౌడ్, జీజుల కార్తీక్, వేముల బిక్షపతి, కొండ్ల కార్తీక్, కొదిరిపాక గణేష్, ఆశా వర్కర్ వడ్లకొండ సరిత, ప్రజలు పాల్గొన్నారు.



# రోడ్డు ప్రమాద బాధితుల్ని అర్థిక సహాయం చేసిన 10.వ .తరగతి పూర్వ విద్యార్థులు.

**తంగళ్ళపల్లి, నేటిధాత్రి:** తంగళ్ళపల్లి మండల కేంద్రంలో గత కొద్దిరోజుల క్రితం రోడ్డు ప్రమాదం గురై. చికిత్స పొందుతున్న. స్వప్న భర్తకి.
మండల కేంద్రంలో (.2001బి2002) పూర్వ విద్యార్థులు స్నేహితులు.స్వప్న భర్తకి ఆర్థిక సాయం అంద. చేశారు. సందర్భంగా. కష్టకాలంలో అండగా నిలవడమే “నిజమైన స్నేహమనే”సందేశాన్ని ఇప్పుడు విద్యార్థులు తమ సేవా భావంతో చాటిచెప్పి అందరికీ ఆదర్శంగా నిలుస్తూ. స్వప్న భర్త రోడ్డు ప్రమాదానికి గురైన సందర్భంగా చికిత్స పొందుతున్న ఆయనకి పూర్వ విద్యార్థులందరూ కలిసి విరాళాలు సేకరించి 34;400. రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేసి.. తమ సేవా భావం చాటిచెప్పి అందరికీ ఆదర్శంగా నిలిచారు. ఇట్టి కార్యక్రమంలో. బండి జగన్. అడిగే జ్ఞానేశ్వరి. లింగం ప్రవీణ్. రెడ్డి పరశురాములు. చొప్పదండి వెంకటేశ్వర్లు. బొల్లారం ప్రమోద్. పెద్దూరి శేఖర్. బిగుల్ల సురేష్. బో నుగాని. పరిసరాములు తదితరులు పాల్గొన్నారు.



# వైద్యరంగంలో మెరిసిన ఆణిముత్యం శ్రావ్య..



**తంగళ్ళపల్లి, నేటిధాత్రి:** తంగళ్ళపల్లి మండలం బస్వాపూర్ గ్రామానికి చెందిన. కర్నే బాలయ్య కూతురు. చదువులో రాణించి. విద్యతో ఉన్నత శిఖరాలను అధిరోహించి. వైద్యరంగంలో. మెరిసి. (మీ). జనరల్ సర్జన్ పూర్తి చేశారు. సందర్భంగా నిరుపేద కుటుంబంలో జన్మించిన కర్నే శ్రావ్య. బాలయ్య కూతురు. పట్టుదలతో కృషితో. ఆత్మవిశ్వాసంతో వైద్య విద్యను పూర్తి చేసి.(మీ). జనరల్ సర్జన్ పూర్తి చేసి గ్రామానికి కాకుండా తోటి విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలిచి. అందరికీ ఆదర్శంగా నిలిచిందని. ఆమె సాధించిన విజయం విద్యార్థులందరికీ ఆదర్శంగా నిలవాలని స్ఫూర్తిదాయకమని గ్రామంలో ప్రతి విద్యార్థి ఆమెను ఆదర్శంగా తీసుకొని ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని సూచిస్తూ. శ్రావ్య.మాట్లాడుతూ. తన విజయానికి తల్లిదండ్రులు ఉపాధ్యాయుల కుటుంబ సభ్యులు ప్రోత్సాహమే కారణమని భవిష్యత్తులో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే తమ లక్ష్యమని. విద్యార్థులందరూ భవిష్యత్తులో. విద్య లో. శ్రద్ధ వహిస్తూ ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని. ఈ సందర్భంగా తెలియజేశారు. ఇందుకుగాను ప్రజాప్రతినిధులు ప్రజలు అందరూ కలిసి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో. బస్వాపూర్ గ్రామ సర్పంచ్ రాజశేఖర్ రెడ్డి. ఉప సర్పంచ్ అనిల్. వార్డు మెంబర్లు. మోతే మహేష్. సజ్జనం ప్రశాంత్. శ్రీకాంత్. దేవరాజ్. గ్రామస్తులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు

# బాలాజీ టెక్నో స్కూల్లో ఘనంగా వన మహోత్సవం



**నర్సంపేట, నేటిధాత్రి:** తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలో పచ్చదనాన్ని పెంపొందించేందుకు చేపట్టిన బృహత్తర వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా సోమవారం నర్సంపేట మండలం లక్నేపల్లి గ్రామంలోని బాలాజీ టెక్నో స్కూల్ లో వన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఏ. రాజేంద్ర ప్రసాద్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, వాతావరణ సమతుల్యతను కాపాడేందుకు ప్రతి వ్యక్తి కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలని పిలుపునిచ్చారు.చెట్ల పెంపకం వల్ల భూగర్భ జలాలు పెరగడంతో పాటు కాలుష్యం తగ్గి, సకాలంలో వర్షాలు కురిసే అవకాశం ఉంటుందని తెలిపారు. పచ్చదనం పెంపొందించేందుకు ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నాయని పేర్కొన్నారు.పాఠశాల ప్రిన్సిపాల్ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ కాలుష్యం ప్రపంచాన్ని వేధిస్తున్న ప్రధాన సమస్యగా మారిందని, ప్రకృతిని నిర్లక్ష్యం చేయడం వల్ల మానవాళికి తీవ్ర నష్టం జరుగుతోందన్నారు. నేడు నాటిన చిన్న మొక్కే రేపటి మహావృక్షమై భవిష్యత్ తరాలకు ప్రాణవాయువును అందిస్తుందని చెప్పారు.నాటిన మొక్కలను సంరక్షిస్తామని విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రతిజ్ఞ చేశారు.

# కొబ్బరి పువ్వు తింటే ఆరోగ్యానికి మేలు




## రోగనిరోధక శక్తి పెరుగుతుంది.....

**భూపాలపల్లి, నేటిధాత్రి:** కొబ్బరి పువ్వు తింటే జీర్ణక్రియకు సహాయపడుతుంది వీటిలోని ఫైబర్ మలబద్ధకాన్ని నివారించి, గట్ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది.బరువు నియంత్రణ తక్కువ కేలరీలు, అధిక ఫైబర్ ఉండటం వల్ల కడుపు నిండిన అనుభూతిని కలిగిస్తాయి.వ్యాధుల నివారణ ఇందులో ఉండే యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీ బాక్టీరియల్ గుణాలు ఇన్ఫెక్షన్ల నుంచి రక్షణనిస్తాయి శక్తిని అందిస్తాయి సులభంగా జీర్ణమయ్యే గుణం వీటిలో ఉంటుంది కొబ్బరి పువ్వు ఆరోగ్య ప్రయోజనాలు రోగనిరోధక శక్తి పెరుగుతుంది జీర్ణక్రియ మెరుగుపడుతుంది కిడ్నీ ఆరోగ్యానికి మేలు శిక్షణ శక్తి లభిస్తుంది గుండె ఆరోగ్యానికి బరువు తగడానికి ఇందులో ఫైబర్, ఒమెగా- పొటాషియం, కాల్షియం, మెగ్నీషియం.బిటమిన్ సి, యాంటిఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి.అక్తపోటు నియంత్రణ, మూత్రపిండాల ఆరోగ్యం, శరీరానికి తక్షణ శక్తి అందించడం.చిత్వల కాంతివంతంగా, జుట్టు ఆరోగ్యంగా ఉండేందుకు సహాయపడుతుంది

# ప్రతి ఒక్కరూ ఓటరు జాబితా సవరణ వినియోగించుకోవాలి

**వీణవంక, నేటిధాత్రి:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సార్ కార్యక్రమం భాగంగా ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రతి పౌరుడి అత్యంత విలువైన హక్కు కావడంతో కొండపాక గ్రామంలో అర్హులైన ప్రతి ఒక్కరు తమ పేర్లు జాబితాలలో సరిగా నమోదై ఉన్నాయో లేదా తప్పనిసరిగా పరిశీలించుకోవాలని బిజెపి సీనియర్ నాయకుడు ఈదునూరి కుమార్ కోరారు దేశ వ్యాప్తంగా జరుగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రంలో వివరాలను శుద్ధి చేసి జాబితాలను పారదర్శకం గా పనులు కొనసాగుతున్నాయి ప్రభుత్వ నియమించిన బూత్ సాయి అధికారులు బిఎల్వోలు ప్రతి ఇంటిని సందర్శించి



ఎన్యూ మరేషన్ పత్రాలను అందజేశామని తెలిపారు ఆ పత్రాలను ఎలా నింపాల్లో తెలియని పక్షంలో అధికారులను అడిగి తెలుసుకునే జాగ్రత్తగా నింపాలని వారు సూచించారు రాజకీయాలకు అతీతంగా హరులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదయ్యేలాగా చూసేదందుకు అపోహలకు గురికాకుండా ఈ ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

# స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

## 9వ వార్డు ప్రజలకు బీజేపీ కౌన్సిలర్ పూర్ణచారి విజ్ఞప్తి....



**పరకాల, నేటిధాత్రి:** భారత ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పరకాల మున్సిపాలిటీ 9వ వార్డు బీజేపీ కౌన్సిలర్ పూర్ణచారి కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంలో భాగంగా బూత్ లెవల్ అధికారులు ఇంటింటికీ వచ్చి ఓటరు వివరాలను పరిశీలిస్తున్నారని తెలిపారు.ప్రజలు వారికి అవసరమైన పత్రాలు అందించి పూర్తి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.ఇప్పటికే ఓటరు జాబితాలో పేరు ఉన్న ప్రతి ఒక్కరూ తమ వివరాలను ఒకసారి పరిశీలించుకోవాలని,పేరు,చిరునామా లేదా ఇతర వివరాల్లో ఏవైనా మార్పులు ఉంటే వాటిని సరిచేయించుకోవాలని సూచించారు.అలాగే మరణించిన వారి పేర్లు,శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారి పేర్ల తొలగింపు ప్రక్రియకు కూడా కుటుంబ సభ్యులు సహకరించాలని కోరారు.ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని,ప్రతి ఓటరు బాధ్యతగా వ్యవహరించి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పూర్ణచారి పిలుపునిచ్చారు.మన ఓటు మన హక్కుమన బాధ్యత అనే భావనతో ప్రతి కుటుంబం ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని ఆయన కోరారు.

# ఎర్రబెల్లి రాఘవరావును ఘనంగా సన్మానించిన కాంగ్రెస్ నాయకులు

**పాలకుర్తి, నేటిధాత్రి:** పాలకుర్తి బ్లాక్ ఆత్మ చైర్మన్‌గా ఎర్రబెల్లి రాఘవరావు ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా తెలంగాణ గ్రాడ్యుయేట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మేడారపు సుధాకర్, జిల్లా కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ జెడ్పీ కో–ఆప్షన్ సభ్యులు ఎండీ మదార్, మాజీ ఎంపీపీ యాక సోమయ్యల ఆధ్వర్యంలో ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి రాఘవరావు మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన పాలకుర్తి శాసన సభ్యురాలు శ్రీమతి యశస్విని రెడ్డి కి, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ శ్రీమతి ఝాన్సీ రాజేందర్ రెడ్డికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.రైతుల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధి, ఆధునిక సాగు విధానాల ప్రోత్సాహం కోసం అంకితభావంతో పని చేస్తానని తెలిపారు. అలాగే ప్రభుత్వ వ్యవసాయ పథకాలను గ్రామీణ స్థాయిలో సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు, రైతుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు యాక రెడ్డి, మాజీ కో–ఆప్షన్ సభ్యులు ఎండీ అబ్బాస్ అలీ, శాతాపురం మాజీ ఉప సర్పంచ్ మారజోడు సంతోష్, చెన్నూరు గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఉపేందర్, శ్రీధర్, కొండయ్య, రాజు, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



# సర్పంచ్ చొరవతో ముమ్మరంగా ఎన్యుమరేషన్ పక్రియ

## గుడిబండ గ్రామం 8, 9, 10 వార్డుల్లో పారాల నమోదు

**కోదాడ, నేటిధాత్రి:** మండల పరిధిలోని గుడిబండ గ్రామంలోని 8, 9, 10 వార్డులలో గ్రామ సర్పంచ్ మందుల నాగయ్య సమక్షంలో ఎన్యుమరేషన్ పారాలను బి ఎల్ ఓ లు, వివిధ పార్టీల బిఎల్ఏ ల ద్వారా పారాలను నింపుడు ప్రక్రియను వేగవంతం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ఎన్యుమరేషన్ పారాలను గ్రామ ప్రజలు త్వరగా బిఎల్ఓ, బి ఎల్ ఎ ల సమక్షంలో తప్పుడు లేకుండా పారాలను నింపి అధికారులకు అందజేయాలని. లేని పక్షాన ఓట్లు గల్లంతయ్యి ప్రమాదం ఉన్నందున ప్రతి ఒక్కరు పారాలను అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిఎల్ఎ కుక్కడపు సైదులు, బి ఎల్ ఓ హేమలత, వార్డు సభ్యులు ప్రేమ చందు, వంశీ, ఎరమాల రోజా, గ్రామ పెద్దలు పేరుమాల్ల వెంకటేశ్వర్లు, నాగరాజు, ప్రజా ప్రతినిధులు పార్టీ కార్యకర్తలు ప్రజలు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# మహాదేవపూర్ గిరిజన సహకార సంస్థలో జరుగుతున్న అక్రమాలపై సమగ్రవిచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

## జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బెల్లంపల్లి సురేష్..

**భూపాలపల్లి, నేటిధాత్రి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలోని గిరిజన సహకార సంస్థ (జీసీసీ) కార్యాలయంలో జరుగుతున్నట్లు ఆరోపిస్తున్న అక్రమాలపై సమగ్ర విచారణ నిర్వహించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ మహాదేవపూర్ మండల అధ్యక్షుడు బెల్లంపల్లి సురేష్ సోమవారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బెల్లంపల్లి సురేష్ మాట్లాడుతూ, మహాదేవపూర్ జీసీసీ కార్యాలయంలో పరిపాలనా వ్యవహారాల్లో అనేక అవకతవకలు జరుగుతున్నాయని






చట్టపరమైన చర్యలు కూడా తీసుకోవాలని కోరారు.అదేవిధంగా డీఎం విధులు నిర్వహిస్తున్న ఇన్‌చార్జి మేనేజర్‌ను వెంటనే ఆ బాధ్యతల నుంచి తొలగించి, నిష్పక్షపాత విచారణ జరిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కంప్యూటర్ ఆపరేటర్, ఇన్‌చార్జి మేనేజర్ కలిసి అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపిస్తూ, ఈ వ్యవహారంపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి వాస్తవాలను వెలికితీయాలని కోరారు.గిరిజన సహకార సంస్థ గిరిజనుల సంక్షేమం కోసం పనిచేసే కీలక సంస్థ అని, కొందరు అధికారుల నిర్లక్ష్యం లేదా అక్రమాల వల్ల సంస్థ ప్రతిష్ఠ దెబ్బతినకుండా ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకోవాలని బెల్లంపల్లి సురేష్ విజ్ఞప్తి చేశారు. గిరిజనుల ప్రయోజనాలను కాపాడేలా జిల్లా యంత్రాంగం తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

ఆరోపించారు. కార్యాలయంలో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్‌తో పాటు డీఎం విధులు నిర్వహిస్తున్న ఇన్‌చార్జి మేనేజర్ వ్యవహారశైలి వల్ల గిరిజనులకు, సేకరణదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ఈ విషయాలపై ఇప్పటికే ఏటూరు నాగారం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి (పీఓ), సంబంధిత డీఎంకు లిఖితపూర్వకంగా ఫిర్యాదులు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోకపోవడంతో చివరకు జిల్లా కలెక్టర్‌ను నేరుగా కలిసి వినతిపత్రం అందజేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. జిల్లా స్థాయిలో ప్రత్యేక అధికారులతో స్వతంత్ర విచారణ కమిటీని ఏర్పాటు చేసి జీసీసీలో జరుగుతున్న అన్ని లావాదేవీలు, పరిపాలనా వ్యవహారాలు, అధికారుల పనితీరును సమగ్రంగా పరిశీలించాలని ఆయన డిమాండ్ చేశారు. విచారణలో అక్రమాలు నిర్ధారణ అయితే బాధ్యులపై శాఖాపరమైన చర్యలతో పాటు

# బడులు మూసివేస్తే ఉద్యమమే.



## విద్యా సదస్సులో వక్తలు రాష్ట్ర అధ్యక్షులు అనిల్ కుమార్, ప్రధాన కార్యదర్శి నన్నెబోయిన తిరుపతి....

**జహీరాబాద్, నేటిదాత్రి:** 27 వేల పాఠశాలలను 4 వేలకు కుదించడం, బడులను మూసివేయడం జరిగితే ఉద్యమం తప్పదని టీపీటీఫ్ రాష్ట్ర అధ్యక్షులు చకినాల అనిల్ కుమార్ అన్నారు. జహీరాబాద్ లో జిల్లా ఉపాధ్యక్షులు కాసుబాగుల బిచ్చయ్య ఉద్యోగ విరమణ సందర్భంగా ఏర్పాటు చేసిన విద్యా సదస్సులో ముఖ్య వక్తగా హాజరై బడుల మూసివేత పరిణామాలు అమెహముపై మాట్లాడుతూ ప్రతి గ్రామంలో బడి ఉండాల్సిన సందర్భంలో, ఇవ్వాళ బడులను మూసివేస్తూ పేద పిల్లలకు విద్యను దూరం చేయడం శోచనీయం అని అన్నారు. ప్రభుత్వం ఏర్పడిన తొలినాళ్ళలో మూతబడిన బడులు తెరిపిస్తానన్న ముఖ్యమంత్రి ఇవ్వాళ బడులను మూసివేయడం సరికాదన్నారు. ఒక వైపు తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను ఏర్పాటు చేస్తూనే, మరో వైపు ప్రభుత్వ బడులను ఎత్తివేయడం ఎంత మాత్రం న్యాయం కాదని అన్నారు. ఇవ్వాళ పల్లె ప్రాంతాల్లో ఏకోపాధ్యాయా, ఇద్దరూ టీచర్లతో, చాలీచాలని వసతులు, సౌకర్యాలలేమితో బడులు సతమతమవుతున్నాయి. ప్రాథమిక విద్యకు పునాది పూర్వ ప్రాథమిక కేంద్రాలు ఏర్పాటులో ప్రభుత్వం చిత్తశుద్ధి లోపించింది. ప్రి ప్రైమరీకి ఒక తరగతి గది, కావలసిన ఆట స్థలం, ఆట వస్తువులు, ఆయా, టీచర్లను ఏర్పాటుచేయాలన్నారు. బడులు తెరిచి నెల రోజులవుతున్నా నేటికి ప్రి ప్రైమరీలలో నియామకం చేయకపోవడం ప్రభుత్వ చిత్తశుద్ధి అర్థమవుతుంది. ఇలాంటి సమస్యలు పరిష్కారం కోసం టీపీటీఫ్ ఉద్యమానికి పిలుపునిస్తుందని అన్నారు. మరో వక్త రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నన్నెబోయిన తిరుపతి ఉపాధ్యాయుల సమస్యలు ఉద్యమాలు అనే అంశంపై మాట్లాడుతూ ప్రభుత్వాలు ఉన్న సమస్యలను పట్టించుకోకుండా, కొత్త సమస్యలను సృష్టిస్తున్నారు. విద్యా హక్కులను కాలరాస్తున్నాయి. అందరికీ విద్యను అందకుండా చేస్తున్నాయి. ఉపాధ్యాయ ఉద్యమాలకు ఏండ్ల చరిత్ర ఉంది, ఉద్యామాల ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయి. అందుకే ప్రస్తుత కాలంలో ప్రతి ఉపాధ్యాయుడు టీపీటీఫ్ నిర్వహించే ఉద్యమాలలో పాల్గొనాలని అన్నారు. రాష్ట్ర పూర్వ అధ్యక్షులు బి కొండల్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో బడులను రక్షించు కోవాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదే, వృత్తి గౌరవాన్ని నిలబెట్టాల్సింది ఉపాధ్యాయులే అని అన్నారు. బడుల మూసివేత కారణంగా ఇవ్వాళ 2 లక్షల మంది పిల్లలు విద్యకు దూరమయ్యారు. పోరాటాల ద్వారానే ఉపాధ్యాయులకు కొన్ని సౌలభ్యాలు లభించాయి. అందుకే మనం పాఠశాలల సంరక్షణ, విద్యార్థుల బాగోగుల బాధ్యత వహించాలని అన్నారు.

# ప్రజావాణిలో 14 వినతుల స్వీకరణ



## ఎన్యూమరేషన్ ఫారాలు జూలై 14లోగా బీఎల్ఓలకు అందజేయాలి...ఆర్డీవో డిఎస్ వెంకన్న...

**పరకాల, నేటిధాత్రి:** పరకాల రెవెన్యూ డివిజనల్ అధికారి అధ్యక్షతన సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి 14 వినతులు స్వీకరించారు. వాటిని సంబంధిత శాఖలకు పంపించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా పరకాల నియోజకవర్గంలోని ఓటర్ల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్)కార్యక్రమంలో భాగంగా అందిన ఎన్యూమరేషన్ ఫారాలను జూలై 14లోగా సంబంధిత బీఎల్ఓలకు తప్పనిసరిగా అందజేయాలని ఆర్డీవో సూచించారు. ఫారాలను సమర్పించకుండా తమ వద్దే ఉంచుకుంటే ఓటరు జాబితా ప్రక్రియపై ప్రభావం పడే అవకాశం ఉందని తెలిపారు.

# ఎస్ ఐ ఆర్(సార్ )సవరణ గడువు నెల రోజులు పొడిగించాలి.



**చిట్యాల, నేటిధాత్రి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండల కేంద్రంలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఓటరు సార్ సవరణ గడువు నెల రోజులుపెంచాలని కోరుతూ తహసిల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తాహసిల్దార్ అనిల్ కి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా అంబేద్కర్ ఫెలోషిప్ జాతీయ అవార్డు గ్రహీత రాష్ట్ర ప్రచార కార్యదర్శి పుల్ల మల్లయ్యలి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వము ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఓటర్ల సవరణ ప్రక్రియ పూర్తి చేయడానికి ఇచ్చిన గడువు సరిపోదని ఆ గడువును నెలరోజులు పెంచాలని ఎన్నికల అధికారులను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం టేకుమట్ల మండల కన్వీనర్ మారేపల్లి కొమురయ్య మండల ప్రచార కార్యదర్శి కట్కూరి రాజు నాయకులు గురుకుంట్ల కిరణ్ గుర్రపు తిరుపతి మొగిలి తదితరులు పాల్గొన్నారు

# జాతీయ నులిపురుగులు దినోత్సవం.



**చిట్యాల, నేటిధాత్రి:** చిట్యాల మండల కేంద్రంలోని కాకతీయ హైస్కూల్లో జాతీయ నులిపురుగుల దినోత్సవం పురస్కరించుకొని విద్యార్థులకు ఆల్బెండజల్ టాబ్లెట్స్ ను పాఠశాల కరస్పాండెంట్ ఆధ్వర్యంలో ఆశ వర్కర్ సునీత వేయడం జరిగింది ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ మహమ్మద్ రాజ్ మహమ్మద్ మాట్లాడుతూ భారత ప్రభుత్వం ప్రతి సంవత్సరం ఒకటి నుండి 18 సంవత్సరాల వయస్సు ఉన్న విద్యార్థులందరికీ కడుపులో నులి పురుగులు రాకుండా ఉండడానికి ఈ టాబ్లెట్లను వేస్తారని అందుకే ఈరోజు మా పాఠశాలలో ఈ కార్యక్రమం జరుపుకోవడం జరిగింది అన్నారు ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

## పలు సమస్యలపై వినతులు స్వీకరించిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్....జాతీయ జల మిషన్ క్యాచ్ ద రైన్ జల ప్రతిజ్ఞ చేసిన అధికారులు...ప్రజావాణి ఫిర్యాదుల సంఖ్య : 87...



**జగిత్యాల, నేటిధాత్రి:** ప్రజావాణి అర్జీల పై సమగ్ర విచారణ జరిపి సమస్యలను త్వరగా పరిష్కరించాలని అధికారులను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు.

## ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ....



పలు సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని పలు మండలాల నుండి ప్రజలు సమస్యలు విన్నవించుకోడానికి ప్రజావాణికి వస్తారని, అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పై సమగ్ర విచారణ చేపట్టి పరిష్కారానికి చొరవ చూపాలని అన్నారు. అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కాగా ఈరోజు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 87 ఫిర్యాదులు, వినతులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం నీటిని ఆదా చేయడం, ప్రతి నీటి చుక్కను సేకరించుటకు సహకారం అందిస్తామని జాతీయ జల మిషన్ జల ప్రతిజ్ఞ చేసిన జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్, అదనపు కలెక్టర్ లు, జిల్లా అధికారులు ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు బి.ఎస్ లత, బి. రాజ గౌడ్, జిల్లా రెవెన్యూ అధికారి ప్రసాద్, సంబంధిత జిల్లా స్థాయి అధికారులు, మున్సిపల్ కమిషనర్ లు, తదితరులు పాల్గొన్నారు.



# కృమి నివారణతోనే పిల్లల ఆరోగ్య పరిరక్షణ

## కౌన్సిలర్ కొయ్యడశ్రీనివాస్.



**పరకాల, నేటిధాత్రి:** జాతీయ కృమి నివారణ దినోత్సవం సందర్భంగా పరకాల పట్టణంలోని ఉర్దూ మీడియం పాఠశాలలో సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 19వ వార్డు కౌన్సిలర్ కొయ్యడ శ్రీనివాస్ మాట్లాడుతూ పేగు పురుగులు పిల్లల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపి రక్తహీనత,పోషకాహార లోపం,బలహీనతతో పాటు చదువుపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతాయని అన్నారు. పిల్లలు చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవడం,గోళ్లను చిన్నగా ఉంచుకోవడం,మరుగుదొడ్లను వినియోగించడం,శుభ్రమైన ఆహారం,తాగునీరు తీసుకోవడం,వైద్యుల సూచన మేరకు కృమి నివారణ మాత్రలు తీసుకోవడం ద్వారా కృముల బారిన పడకుండా ఉండవచ్చని తెలిపారు. ఆరోగ్యకరమైన బాల్యం కోసం కృమి రహిత సమాజం కోసం అందరం కలిసి పనిచేద్దామని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు గొడుగు రజిత నాగరాజ్,బండి శ్రీధర్,ఏఎన్ఎం రజిత,ఆశా వర్కర్ నిర్మల,పాఠశాల ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డిపై నర్సంపేట పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు

## బీఆర్ఎస్ నర్సంపేట పట్టణ అధ్యక్షుడు, కౌన్సిలర్ల వినతి...



**నర్సంపేట, నేటిధాత్రి:** ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఇటీవల చేసిన వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బీఆర్ఎస్ నర్సంపేట పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణ గౌడ్, పలువురు కౌన్సిలర్లు సోమవారం నర్సంపేట పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమం నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ఆదేశాల మేరకు నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నాగెల్లి వెంకటనారాయణ గౌడ్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి మీడియా సమావేశంలో చేసిన వ్యాఖ్యలు ప్రతిపక్ష నాయకులు, రైతులను అవమానించేలా ఉండటమే కాకుండా హింసను ప్రేరేపించే విధంగా ఉన్నాయని ఆరోపించారు. రాష్ట్రంలో రైతులు కరువు పరిస్థితులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో ఇటువంటి వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. గోదావరి నదిలో నీటి లభ్యత ఉన్నప్పటికీ రైతులకు సాగునీరు అందించకుండా కాళేశ్వరం ప్రాజెక్టుపై విమర్శలు చేస్తూ ప్రభుత్వం కాలయాపన చేస్తోందని ఆరోపించారు. సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణపై ప్రభుత్వానికి సరైన అవగాహన లేదని విమర్శించారు. ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్--2023)లోని సంబంధిత సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేసి నిష్పాక్షికంగా దర్యాప్తు జరపాలని, రైతులు, ప్రతిపక్ష నాయకులు, వారి కుటుంబ సభ్యులకు తగిన రక్షణ కల్పించాలని పోలీసులను కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో 16వ వార్డు కౌన్సిలర్ బానోతు నవీన్ నాయక్, 21వ వార్డు కౌన్సిలర్ శివరాత్రి స్వామి, 26వ వార్డు కౌన్సిలర్ మండల శ్రీదేవి శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ ఓటరు జాబితా సవరణ వినియోగించుకోవాలి



**జహీరాబాద్, నేటిధాత్రి:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సార్ కార్యక్రమం భాగంగా ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రతి పౌరుడి అత్యంత విలువైన హక్కు కావడంతో ఝరాసంగం గ్రామంలో అర్హులైన ప్రతి ఒక్కరు తమ పేర్లు జాబితాలలో సరిగా నమోదై ఉన్నాయో లేదా తప్పనిసరిగా పరిశీలించుకోవాలని మాజీ సర్పంచ్ జగదీశ్వర్ కోరారు దేశ వ్యాప్తంగా జరుగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రంలో వివరాలను శుద్ధిచేసి జాబితాలను పారదర్శకం గా పనులు కొనసాగుతున్నాయి ప్రభుత్వ నియమించిన బూత్ సాయి అధికారులు బిఎల్వోలు ప్రతి ఇంటిని సందర్శించి ఎన్యూ మరేషన్ పత్రాలను అందజేశామని తెలిపారు ఆ పత్రాలను ఎలా నింపాల్లో తెలియని పక్షంలో అధికారులను అడిగి తెలుసుకునే జాగ్రత్తగా నింపాలని వారు సూచించారు రాజకీయాలకు అతీతంగా హర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదయ్యేలాగా చూసేదందుకు అపోహలకు గురికాకుండా ఈ ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

# శేట్‌పల్లిలో వైభవంగా మధున పోశమ్మ బోనాలు

**జైపూర్, నేటిధాత్రి:** జైపూర్ మండలంలోని శేట్‌పల్లి గ్రామంలో ఆదివారం మధున పోశమ్మ బోనాల పండుగను గ్రామస్థులు అత్యంత భక్తిశ్రద్ధలతో,ఘనంగా నిర్వహించారు.

## అమ్మవారిని దర్శించుకున్న వేలాది భక్తులు...



**బోనాలతో ఊరేగింపు:** మహిళలు సాంప్రదాయ దుస్తుల్లో ముస్తాబై,అందంగా అలంకరించిన బోనాలను తలపై మోసుకుని డప్పు చప్పుళ్లు,మంగళవాయిద్యాల నడుమ కోలాహలంగా ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు.

**ప్రత్యేక పూజలు:** ఆలయానికి చేరుకున్న భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి,ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. తమ కుటుంబాలు సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, గ్రామ ప్రజలంతా క్షేమంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు. కిక్కిరిసిన

**ఆలయ ప్రాంగణం:** బోనాల ఉత్సవాల సందర్భంగా శేట్‌పల్లి పోశమ్మ ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయింది. ? ఈ వేడుకల్లో గ్రామస్థులు,మహిళలు,యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని,ఎంతో ఉత్సాహంగా పండుగను జరుపుకున్నారు. గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం సంతరించుకుంది.

# యాదాద్రి వాకర్స్ అర్బన్ మరియు రూరల్ డెవలప్మెంట్ సొసైటీ సర్వసభ్య సమావేశం





**యాదగిరిగుట్ట, నేటిధాత్రి:** యాదగిరిగుట్ట పట్టణంలో యాదాద్రి వాకర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం సాయి శివ ఫంక్షన్ హాల్ మైలార్ గూడెం నందు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి యాదాద్రి వాకర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు సీసా కృష్ణ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కాసాపు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి షేక్ ఉస్మాన్ షరీఫ్, కోశాధికారి ఎక్కలదేవి భాస్కర్ పాల్గొని యాదాద్రి వాకర్స్ అసోసియేషన్ చేయబోయే సేవ కార్యక్రమాల గురించి వివరించారు. త్వరలో యాదగిరిగుట్టలో రచ్చ శ్రీను సహకారంతో మెడికల్ క్యాంప్ నిర్వహించి ఉచితంగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు, మందులు పంపిణీ చేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు ప్రసంగించి వాకింగ్ వలన కలుగు లాభాలను సభ్యులందరికీ వివరించారు, ఎన్ని ఆస్తులు ఉన్నా ఆరోగ్యమే మహాభాగ్యం అని అధ్యక్షులు కాసాపు శ్రీనివాస్ తన ప్రసంగంలో తెలియజేశారు, ప్రతి మనిషికి సమస్యలు ఉంటాయి ఉదయం ఒక అరగంట వాకింగ్ వ్యాయామం వలన రోజు మొత్తం ఉత్సాహంగా గడపవచ్చు అని గౌరవ సలహాదారులు సుదగాని గోపాల్ వివరించారు, తర్వాత ప్రతిరోజు వాకింగ్ వలన షుగర్, బీపీ, కొలెస్ట్రాల్, మొదలగునవి కంట్రోల్లో ఉంటాయని మానసిక ఆనందం కలుగుతుందని సభ్యులు తమ ప్రసంగంలో వివరించారు, ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో సభ్యులు పాల్గొన్నారు. ఈ సమావేశం అనంతరం ఓపెన్ జిమ్ ఏర్పాటులో తన విలువైన సమయాన్ని కేటాయించి జిమ్ ఏర్పాట్లలో ముఖ్య భూమిక పోషించిన సీస కృష్ణ గారిని యాదాద్రి వాకర్స్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా సన్మానించారు, అలాగే యాదగిరిగుట్ట మున్సిపాలిటీలో కో ఆప్షన్ నెంబర్ గా ఎన్నికైన యాదాద్రి వాకర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి షేక్ ఉస్మాన్ షరీఫ్ గారిని సభ్యులందరూ కలిసి సన్మానించారు. ఇట్టి సమావేశం విజయవంతం అయినదని యాదాద్రి వాకర్స్అసోసియేషన్ కోశాధికారి ఎక్కలదేవి భాస్కర్ తెలియజేశారు.

# జర్నలిస్టుల హక్కుల పరిరక్షణే టిజెఎ ప్రధాన ధ్యేయం

## జూలై 23న టిజెఎ 12వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు...జిల్లా అధ్యక్షుడు పార్వతి సురేష్ కుమార్...



**మంచిర్యాల, నేటిధాత్రి:** జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ,సంక్షేమం,వృత్తి గౌరవం కోసం తెలంగాణ జర్నలిస్ట్స్ అసోసియేషన్ (టిజెఎ) ఉద్యమ స్ఫూర్తితో నిరంతరం కృషి చేస్తోందని ఆ సంఘం మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు పార్వతి సురేష్ కుమార్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు ఈ నెల 23న టిజెఎ 12వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో జర్నలిస్టులు పోషించిన విశిష్ట పాత్రను గుర్తు చేస్తూ,అదే స్ఫూర్తితో జర్నలిస్టుల సంక్షేమం, వృత్తి స్వేచ్ఛ కోసం టిజెఎ అంకితభావంతో పనిచేస్తోందని పేర్కొన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో టిజెఎ ఎల్లప్పుడూ ముందుంటుందని ఆయన అన్నారు. అక్రిడిటేషన్లు,హెల్త్ కార్డులు,ఇళ్ల స్థలాలు,బీమా,పెన్షన్ వంటి న్యాయమైన డిమాండ్ల సాధనతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుకు సంఘం నిరంతరం పోరాటం సాగిస్తోందని వివరించారు. ప్రతి జర్నలిస్టు హక్కును కాపాడటమే టిజెఎ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. సభ్యత్వమే సంఘానికి బలమని,ఐక్యతే విజయానికి మార్గమని పేర్కొంటూ జిల్లాలోని ప్రింట్,ఎలక్ట్రానిక్,డిజిటల్,వెబ్ మీడియా జర్నలిస్టులందరూ పెద్ద ఎత్తున సభ్యత్వం స్వీకరించి సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని కోరారు. జూలై 23న జరిగే ఆవిర్భావ దినోత్సవ వేడుకలు,సభ్యత్వ నమోదు కార్యక్రమానికి జిల్లాలోని జర్నలిస్టులందరూ హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు డేగ ఆంజనేయులు,మాసు రాకేష్,సోదరి దుర్గయ్య, చిట్యాల వినీత్ పాల్గొన్నారు.

# పరకాల నుంచి ప్రపంచ వేదికపైకి...

## కరాటేలో ఎండి.జాహిద్ స్ఫూర్తిదాయక ప్రస్థానం

- మూడు దశాబ్దాల సాధనకు గిన్నిస్ వరల్డ్ రికార్డు నమోదైన ప్రదర్శనలో భాగస్వామ్యం
- తండ్రి చూపిన దారిలో నడిచి అంతర్జాతీయ గుర్తింపు పొందిన క్రీడాకారుడు





పరకాల,నేటిధాత్రి

కలలు కనడం ఒకటి.వాటిని నిజం చేసుకోవడం మరోటి.ఆ కలలను సాకారం చేసుకోవడానికి సంవత్సరాల తరబడి క్రమశిక్షణతో కృషి చేయడం చాలా కొద్దిమందికే సాధ్యమవుతుంది.అలాంటి వారిలో పరకాల పట్టణానికి చెందిన కరాటే క్రీడాకారుడు ఎండి జాహిద్ ఒకరు.చిన్ననాటి నుంచి కరాటేపై ఆసక్తిని పెంచుకుని,మూడు దశాబ్దాలకు పైగా నిరంతర సాధన చేస్తూ,ఇటీవల గిన్నిస్ వరల్డ్ రికార్డు నమోదైన కరాటే ప్రదర్శనలో భాగస్వామిగా నిలిచి పరకాలకే కాకుండా ఉమ్మడి వరంగల్ జిల్లాకు గర్వకారణంగా నిలిచారు.హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో 2026 ఏప్రిల్ 26న నిర్వహించిన 'లార్జెస్ట్ కరాటే డిస్‌ప్లే' కార్యక్రమంలో దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు చెందిన 1,212 మంది సీనియర్,జూనియర్ కరాటే క్రీడాకారులు ఒకేసారి కరాటే విన్యాసాలు ప్రదర్శించారు.ఈ భారీ ప్రదర్శన గిన్నిస్ వరల్డ్ రికార్డుగా నమోదైంది.ఆ చారిత్రాత్మక ఘట్టంలో పరకాలకు చెందిన ఎండి జాహిద్ కూడా భాగస్వామిగా నిలిచి ప్రపంచ వేదికపై తన ప్రతిభను చాటుకున్నారు.

### చదువు,క్రీడ,క్రమశిక్షణ

పరకాలకు చెందిన మహ్మద్ గౌస్ (చాంద్ బాయి), మహబూబ్ బీ దంపతుల కుమారుడైన ఎండి జాహిద్ బాల్యం నుంచే క్రమశిక్షణకు ప్రాధాన్యం ఇచ్చారు.పరకాల శిశుమందిర్ పాఠశాలలో ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యాభ్యాసం పూర్తి చేశారు.అనంతరం పరకాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ల్యాబ్ టెక్నీషియన్ కోర్సు పూర్తి చేశారు.తర్వాత వాగ్దేవి డిగ్రీ కళాశాలలో 1997 నుంచి 2000 వరకు డిగ్రీ చదువుతూ ఎన్‌సీసీలో చురుకుగా పాల్గొన్నారు.చదువుతో పాటు క్రమశిక్షణను పెంపొందించిన ఎన్‌సీసీ అనుభవం ఆయన వ్యక్తిత్వ వికాసానికి ఎంతో దోహదపడింది.ప్రస్తుతం సిద్దాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా విధులు నిర్వహిస్తున్నారు.ఉద్యోగ బాధ్యతలు ఎంత బిజీగా ఉన్నప్పటికీ కరాటే సాధనను మాత్రం ఎప్పుడూ విస్మరించలేదు.విధులు ముగిసిన తర్వాత కూడా సాధనకు సమయం కేటాయిస్తూ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

### 1991లో మొదలైన కరాటే ప్రస్థానం

చిన్ననాటి నుంచే కరాటేపై మక్కువ పెంచుకున్న జాహిద్ 1991లో పరకాలలోని బడోకాన్ కరాటే ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ద్వారా శిక్షణ ప్రారంభించారు.ప్రముఖ గురువులు మహ్మద్ యాకుబ్, మాడ సంపత్, వద్ద కఠిన సాధన చేసి కేవలం ఐదేళ్లలోనే 1996లో బ్లాక్ బెల్ట్ సాధించారు.అప్పటి నుంచి కరాటేను జీవితంలో విడదీయరాని భాగంగా మార్చుకుని నిరంతర సాధన కొనసాగిస్తున్నారు.

### రాష్ట్రం నుంచి జాతీయ స్థాయికి...

ఎండి జాహిద్ ప్రతిభ రాష్ట్ర స్థాయికే పరిమితం కాలేదు.రాష్ట్ర,జాతీయ స్థాయి కరాటే పోటీల్లో పాల్గొని పలు బంగారు పతకాలు సాధించారు.ముఖ్యంగా స్పారింగ్,కటా విభాగంలో విశేష ప్రతిభ కనబరిచి అనేక అవార్డులు అందుకున్నారు.క్రమశిక్షణ,ఏకాగ్రత,పట్టుదలతో క్రీడా రంగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు.



### తండ్రే తొలి గురువు..

ఎండి జాహిద్ విజయానికి మూలం ఆయన కుటుంబం.ముఖ్యంగా తండ్రి మహ్మద్ గౌస్ (చాంద్ భాయ్)కూడా కరాటే మాస్టర్‌గా పరకాలతో పాటు పరిసర గ్రామాల్లో వందలాది మంది విద్యార్థులకు కరాటే శిక్షణ అందించేవారు.చిన్నప్పటి నుంచే తండ్రి శిక్షణ,సేవాభావం,క్రమశిక్షణను చూసి పెరిగిన జాహిద్ అదే స్ఫూర్తితో కరాటేలో అడుగుపెట్టి నేడు ప్రపంచ రికార్డు నమోదైన ప్రదర్శనలో భాగస్వామిగా నిలిచారు.

### గిన్నిస్ వేదికపై పరకాల పేరు

ప్రపంచవ్యాప్తంగా అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావించే గిన్నిస్ వరల్డ్ రికార్డులో చోటు దక్కించుకోవడం ప్రతి క్రీడాకారుడి కల.అలాంటి వేదికపై పరకాల పట్టణానికి చెందిన క్రీడాకారుడు నిలవడం స్థానికులకు గర్వకారణంగా మారింది.గ్రామీణ ప్రాంతాల నుంచి కూడా ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందవచ్చని జాహిద్ తన విజయంతో నిరూపించారు.

### కరాటే జీవన విధానం జాహిద్ మాటల్లో

ఈ సందర్భంగా ఎండి జాహిద్ మాట్లాడుతూ "గిన్నిస్ వరల్డ్ రికార్డు నమోదైన కార్యక్రమంలో భాగస్వామి కావడం నా జీవితంలో మరపురాని ఘట్టం.ఈ స్థాయికి రావడానికి శిక్షణ ఇచ్చిన గురువులు మహ్మద్ యాకుబ్, మాడ సంపత్,,అలాగే నా తండ్రి మహ్మద్ గౌస్ (చాంద్ భాయ్),కుటుంబ సభ్యుల ప్రోత్సాహం ఎంతో కీలకం.వారందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు.కరాటే అనేది కేవలం ఆత్మరక్షణ విద్య మాత్రమే కాదు.క్రమశిక్షణ,ఆత్మవిశ్వాసం,మానసిక ధైర్యాన్ని పెంపొందించే జీవన విధానం. యువత ఎక్కువగా క్రీడలవైపు అడుగులు వేసి ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని తెలిపారు.

### స్ఫూర్తిగా నిలిచిన ప్రస్థానం

పరకాల వంటి చిన్న పట్టణంలో ప్రారంభమైన కరాటే ప్రయాణం ప్రపంచ రికార్డు నమోదైన ప్రదర్శన వరకు చేరుకోవడం సాధారణ విషయం కాదు.దీని వెనుక మూడు దశాబ్దాల కృషి,క్రమశిక్షణ,అంకితభావం ఉన్నాయి.ఉద్యోగ బాధ్యతలను సమర్థంగా నిర్వర్తిస్తూనే క్రీడలోనూ రాణించడం ఆయన ప్రత్యేకత.కష్టపడితే ప్రపంచ స్థాయిలోనూ గుర్తింపు సాధించవచ్చని ఎండి జాహిద్ తన జీవితంతో నిరూపించారు.

# మాదిగ వర్ధన్నపేట నియోజకవర్గ మండల అధ్యక్షుల నియామకం: డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ





హనుమకొండ జిల్లా, నేటిధాత్రి:

మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షులు రేగుంట సునీల్ మాదిగ ఆదేశాల మేరకు, రాష్ట్ర గౌరవాధ్యక్షులు డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ , రాష్ట్ర ముఖ్య సలహాదారు కొమ్ముల బాబు , వర్ధన్నపేట నియోజకవర్గ ఇన్‌చార్జి ఇస్రం నరేష్ సమక్షంలో, వర్ధన్నపేట నియోజకవర్గం లోని మండలాలు ఐనవోలు కు గుడ్డేటి శ్రావణ్ కుమార్ మోషేను హనుమకొండ కు ఆరెపల్లి సుమన్ ను పర్వతగిరి కు పసునూరి వర్మను వర్ధన్నపేట కు సిలివేరు ఆనందం ను హాసన్ పర్తి కు ఆకారపు రాజు ను మాదిగ హక్కుల దండోరా మండల అధ్యక్షులుగా నియమించి, నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ మాట్లాడుతూ, సమాజ హక్కుల సాధన, రాజ్యాంగ పరిరక్షణ, సామాజిక న్యాయం కోసం ప్రతి కార్యకర్త నిబద్ధతతో పనిచేయాలని, సంస్థను గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. నూతన మండల అధ్యక్షులకు సంస్థ అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తారనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. రాష్ట్ర ముఖ్య సలహాదారు కొమ్ముల బాబు మాట్లాడుతూ, మాదిగ హక్కుల దండోరా ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతి నాయకుడు బాధ్యతాయుతంగా పనిచేయాలని, సామాజిక చైతన్యం పెంపొందించేందుకు కృషి చేయాలని సూచించారు. వర్ధన్నపేట నియోజకవర్గ ఇన్‌చార్జి ఇస్రం నరేష్ మాట్లాడుతూ, మాదిగ హక్కుల దండోరా ఉద్యమాన్ని ప్రతి గ్రామానికి విస్తరించి, యువతను ఉద్యమంలో భాగస్వాములను చేయాలని పిలుపునిచ్చారు. నూతన మండల అధ్యక్షులు మాట్లాడుతూ, తమపై నమ్మకం ఉంచి బాధ్యత అప్పగించిన రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ, మండలలో సంస్థను బలోపేతం చేయడంతో పాటు మాదిగ సమాజ హక్కుల కోసం అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ నాయకులు, కార్యకర్తలు మరియు పలువురు ప్రముఖులు పాల్గొని నూతన మండల అధ్యక్షుడికి శుభాకాంక్షలు తెలిపారు.

# జర్నలిస్టుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

## హనుమకొండ కలెక్టరేట్‌ను ముట్టడించిన టీడబ్ల్యూజెఎఫ్






- ఇంటి స్థలాలు, హెల్త్ కార్డులు ఇవ్వాలని డిమాండ్
- కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పణ

హనుమకొండ జిల్లా , నేటిధాత్రి:

జర్నలిస్టుల దీర్ఘకాలిక సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (టీడబ్ల్యూజెఎఫ్) ఆధ్వర్యంలో సోమవారం హనుమకొండ కలెక్టరేట్‌ను భారీ ఎత్తున ముట్టడించారు. ఫెడరేషన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు టి.వి. రాజు గౌడ్, ప్రధాన కార్యదర్శి అంతడుపుల శ్రీనివాస్ నేతృత్వంలో జిల్లా నలుమూలల నుండి తరలివచ్చిన జర్నలిస్టులు కలెక్టరేట్ ఎదుట పెద్ద పెట్టున నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు దయాసాగర్, చంద్రశేఖర్ మాట్లాడుతూ సమాజ శ్రేయస్సు కోసం అహర్నిశలు శ్రమించే జర్నలిస్టుల సంక్షేమాన్ని ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. అర్హులైన ప్రతి జర్నలిస్టుకు ఎలాంటి కొర్రీలు లేకుండా అక్రెడిటేషన్ కార్డులు, ఇంటి స్థలాలు కేటాయించి నిర్మాణానికి ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. అలాగే జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యుల కోసం ఉచిత వైద్యం అందేలా హెల్త్ కార్డులు జారీ చేయాలని, రద్దయిన రైల్వే కన్సెషన్ పాస్‌లను పునరుద్ధరించాలని, ప్రభుత్వమే ఉచిత బీమా సౌకర్యం కల్పించాలని కోరారు.

ఆందోళన అనంతరం టీడబ్ల్యూజెఎఫ్ ప్రతినిధి బృందం జిల్లా కలెక్టర్‌ను కలిసి తమ న్యాయమైన డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించింది.

ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూజెఎఫ్ రాష్ట్ర నాయకులు బొక్క దయాసాగర్, చంద్రశేఖర్, జిల్లా కోశాధికారి ఈసంపల్లి రమేష్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పి. గోపాల్, సహాయ కార్యదర్శి మంద రాజేష్, ఈర్ల తిలక్, రాజు, వలీ పాల్గొన్నారు. అలాగే పశ్చిమ నియోజకవర్గం కన్వీనర్ అనిల్ రెడ్డి, కార్యదర్శి వెంకటేష్, కోశాధికారి గుగులోతు హుస్సేన్, సంపత్, రాజేందర్, పరకాల నియోజకవర్గ అధ్యక్షులు చంద్రమౌళి, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షులు నాగేందర్, సెక్రెటరీ దాసరి విజయ్, కోశాధికారి దేవేందర్, అశోక్, సుమన్, మనోహర్ పెద్ద సంఖ్యలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు పాల్గొన్నారు.

# మాదాపూర్ జీహెచ్ఎంసీలో అవినీతి ఆరోపణలు..!

## చైన్‌మెన్‌పై అక్రమ వసూళ్ల ఫిర్యాదులు.. సమగ్ర విచారణకు స్థానికుల డిమాండ్

శేరిలింగంపల్లి, నేటిధాత్రి

మాదాపూర్ జీహెచ్ఎంసీ సర్కిల్ పరిధిలో పనిచేస్తున్న ఒక చైన్‌మెన్‌పై అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారంటూ స్థానికుల నుంచి తీవ్ర ఆరోపణలు వెలువడుతున్నాయి. నిర్మాణ అనుమతులు, తనిఖీల పేరుతో భయపెట్టి డబ్బులు డిమాండ్ చేస్తున్నారని, ఈ వ్యవహారంలో ఒక ప్రైవేట్ వ్యక్తిని వినియోగిస్తున్నారంటూ బాధితులు ఆరోపిస్తున్నారు.

స్థానికుల కథనం ప్రకారం, కొత్తగా ఇళ్ల నిర్మాణం చేపట్టిన వారికి ముందుగా ఫోన్ చేసి, అనంతరం ఒక ప్రైవేట్ వ్యక్తిని పంపించి డబ్బులు వసూలు చేస్తున్నారని పేర్కొంటున్నారు. డబ్బులు ఇవ్వకపోతే భవనాన్ని సీజ్ చేస్తామని లేదా కూల్చివేస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అంజయ్య నగర్, సిద్దిక్ నగర్, న్యూ కాలనీ, ఇజ్జత్ నగర్, మయూరి నగర్, మాతృశ్రీ నగర్ ప్రాంతాల్లో నివసించే పేద, మధ్యతరగతి కుటుంబాలే ఎక్కువగా ఇలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు స్థానికులు చెబుతున్నారు.

అలాగే, ఉన్నతాధికారుల పేర్లు ప్రస్తావిస్తూ డబ్బులు డిమాండ్ చేస్తున్నారన్న ఆరోపణలు కూడా ఉన్నాయని బాధితులు పేర్కొంటున్నారు. ఈ ఆరోపణలపై సంబంధిత ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి, వాస్తవాలు వెలుగులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. స్థానికులు చేసిన ఈ ఆరోపణలపై సంబంధిత చైన్‌మెన్, పేర్కొన్న ప్రైవేట్ వ్యక్తి, అలాగే జీహెచ్ఎంసీ అధికారుల స్పందన అందాల్సి ఉంది.

- నిర్మాణ అనుమతుల పేరుతో డబ్బులు డిమాండ్ చేస్తున్నారన్న ఆరోపణలు
- ప్రైవేట్ వ్యక్తి ద్వారా వసూళ్లు చేస్తున్నారంటూ బాధితుల ఫిర్యాదు
- పేద, మధ్యతరగతి కుటుంబాలనే లక్ష్యంగా చేసుకుంటున్నారన్న స్థానికుల ఆవేదన
- కమిషనర్ జోక్యం చేసుకుని విచారణ చేపట్టాలని విజ్ఞప్తి




### కమిషనర్ స్పందించాలంటున్న స్థానికులు

ఈ ఆరోపణలపై జీహెచ్ఎంసీ కమిషనర్ తక్షణ విచారణకు ఆదేశాలు ఇవ్వాలని, అవసరమైతే అవినీతి నిరోధక సంస్థలతోనూ దర్యాప్తు జరిపించాలని స్థానికులు కోరుతున్నారు. ఆరోపణలు నిజమని తేలితే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.




గమనిక: ఈ కథనంలోని అంశాలు స్థానికులు, బాధితులు చేసిన ఫిర్యాదులు మరియు ఆరోపణల ఆధారంగా ప్రచురించబడుతున్నాయి. ఈ ఆరోపణలపై సంబంధిత అధికారుల అధికారిక స్పందన అందాల్సి ఉంది. విచారణలో తేలే వాస్తవాల ఆధారంగా తదుపరి పరిణామాలు ఉంటాయి.

# ఓటరు జాబితా సవరణలో ప్రతి ఓటరికి అండగా నిలవాలి

- –మూడో డివిజన్ బీఎల్‌ఏలు, సభ్యత్వ నమోదు, సామాజిక మాధ్యమ కార్యకర్తలతో సమీక్ష
- –ఎన్యూమరేషన్ ఫారాల పూర్తి, డిజిటలైజేషన్ వేగవంతం చేయాలని పిలుపు
- –క్షేత్రస్థాయిలో ఓటర్లకు సహకారం అందించాలని అరూరి రమేష్ సూచన



వరంగల్, నేటిధాత్రి:

వర్ధన్నపేట నియోజకవర్గం గ్రేటర్ వరంగల్ మూడో డివిజన్ మాజీ అధ్యక్షుడు నేరెళ్ల రాజు నివాసంలో భారత రాష్ట్ర సమితి పార్టీ బూత్ స్థాయి ప్రతినిధులు, సభ్యత్వ నమోదు కార్యకర్తలు, సామాజిక మాధ్యమ కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వర్ధన్నపేట నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు అరూరి రమేష్ పాల్గొని పార్టీ కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా అరూరి రమేష్ మాట్లాడుతూ ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో ఎన్యూమరేషన్ ఫారాలను పూర్తి చేసే ప్రక్రియలో ప్రతి ఓటరికి అందుబాటులో ఉండాలని బూత్ స్థాయి ప్రతినిధులకు సూచించారు. క్షేత్రస్థాయిలో ప్రజలను నేరుగా కలిసి అవసరమైన సహాయం అందించాలని, ఎలాంటి ఓటరు కూడా ఇబ్బందులు ఎదుర్కోకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్‌ను వీలైనంత త్వరగా పూర్తి చేసి ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించే బాధ్యతను బూత్ స్థాయి ప్రతినిధులు సమర్థంగా నిర్వహించాలని ఆయన అన్నారు. ఓటర్లకు అవసరమైన సమాచారం, సందేహాలకు సమాధానాలు ఆన్‌లైన్‌తో పాటు ముద్రిత ఓటరు జాబితాల ద్వారా కూడా అందించాలని సూచించారు. మూడో డివిజన్ పరిధిలోని బూత్ స్థాయి ప్రతినిధుల నుంచి ఇప్పటి వరకు ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో జరిగిన పురోగతిపై పూర్తి వివరాలను అడిగి తెలుసుకుని, మిగిలిన పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు.

ఈ సమావేశంలో వర్ధన్నపేట నియోజకవర్గ ప్రత్యేక ఓటరు జాబితా సవరణ, సభ్యత్వ నమోదు ఇంచార్జి మసూద్, జిల్లా రైతు బంధు సమితి మాజీ ఛైర్మన్ ఎల్లవుల లలిత యాదవ్--కుమార్, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఛైర్మన్ ఇట్యాల హరికృష్ణ, డివిజన్ ముఖ్య నాయకులు, బూత్ స్థాయి ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

**Printed, Published & owned by Katta Raghavender Rao,** Printed at S.V. Offset Printers, H. No. 4-6-65, S.T. Josephes High School,Kumarpalli Hanamkond, Warangal-01. Telangana State. & Published from, H.No.4-6-65, Opp. S.T. Josephes High School,kumarpalli, Hanamkonda, Warangal -506001. Telangana State.
**Editor : Katta Raghavender Rao, RNI No. APTEL / 2005/15537. E-mail :** netidhatrisv@gmail.com Cell : 9908658888, 8297779999